## విలేకరులు కావలెను

మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను

Cell: 9247819181
8309605189



RNI:TGTEL/25/A1882

# మన వార్త

ప్రజాగళానికి అక్షర రూపం

MANA VAARTHA

EPAPER.MANAVAARTHA.NET

MANA VAARTHA

Karimnagar,Telangana | సంపుటి:1, సంచిక:56 | volume::1, Issue:56 | సోమవారం 22 సెప్టెంబర్ 2025 పేజీలు : 8 వెల : 3.00


### హెచ్-1బీ వీసాలపై ట్రంప్ ఉత్తర్వులు

## దిగ్భ్రాంతికరం అన్న సీఎం రేవంత్



హే చ్-1బీ వీసాల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయంపై తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ నిర్ణయం తెలుగు టెకీలపై, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై పెను ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు. ట్రంప్ జారీ చేసిన ఉత్తర్వులు దిగ్భ్రాంతికి గురిచేశాయని, ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ముఖ్యమంత్రి అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఈ నిర్ణయంతో తెలుగు టెకీల ఆవేదన వర్ణనాతీతంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా అమెరికాకు సేవలు అందిస్తున్న నిపుణుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి జైశంకర్ యుద్ధ ప్రాతిపదికన ఈ సమస్యను పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మరోవైపు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఈ అంశంపై శనివారం సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. ట్రంప్ నిర్ణయంతో దేశంలో అత్యధికంగా నష్టపోయే రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని ఆయన స్పష్టం చేశారు. దేశానికి ఏటా వచ్చే మొత్తం రెమిటెన్స్‌లలో 8.1 శాతం వాటాతో తెలంగాణ నాలుగో స్థానంలో ఉందని, తాజా నిర్ణయం ఈ రాబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. ఈ విషయంపై కేంద్రానికి లేఖ రాస్తామని ఆయన తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఇంత నష్టం జరుగుతున్నా ప్రధాని మోదీ స్పందించకపోవడం దురదృష్టకరమని శ్రీధర్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. "ట్రంప్ ఆలోచనా విధానం ఆయన ప్రియ మిత్రుడు మోదీకే బాగా తెలుసు" అంటూ ఎద్దేవా చేశారు. సమస్య తీవ్రతను ముందుగానే అంచనా వేసి అమెరికాతో చర్చలు జరపడంలో కేంద్రం విఫలమైందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రధాని, విదేశాంగ మంత్రి మేల్కొని అమెరికాతో చర్చలు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.

## గాజులారామారంలో హైడ్రా కూల్చివేతలు

# ప్రభుత్వ ల్యాండ్ రికవరీ




కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజుల రామారంలో ఉద్రిక్తత నెలకొంది. గాజుల రామారం లో ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఇండ్లు నిర్మించారంటూ హైడ్రా అధికారులు కూల్చేవేత చేపట్టారు. ఆదివారం (సెప్టెంబర్ 21) ఉదయం భారీ బందోబస్తు మధ్య అక్రమ కట్టడాలను తొలగించే వందల సంఖ్యలో పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో కలసి గాజులరామారం లో కూల్చివేతలు చేపట్టారు. అయితే స్థానికులు కూల్చివేతలను అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. గాజుల రామారంలోని సర్వే నెంబర్లు 307,342,329/1,348లలో అక్రమంగా ఇండ్లు నిర్మించారని హైడ్రా అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు దాదాపు 500 మంది పోలీసులుహైడ్రా ఫోర్స్, జీహెచ్ఎంసి, రెవిన్యూ అధికారులతో కలిసి జేసీబీలతో అక్రమంగా నిర్మించిన ఇండ్లను కూల్చివేశారు. గాజుల రామారం ఏరియాలో మొత్తం 300 ఎకరాలకు పైగా భూమి ఆక్రమణకు గురైందని గుర్తించిన హైడ్రా కూల్చేవేతలు చేపట్టింది. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ కు కేటాయించిన భూమిలో బడా బాబుల ఆక్రమణలు చేశారని.. వందల ఎకరాల్లో వెంచర్లు వేసి ప్లాట్లుగా విక్రయాలు చేశారని వారిపై చర్యలు తీసుకుంటామని హైడ్రా అధికారులు తెలిపారు. పేదవారిని ముందు పెట్టి బడాబాబులు వేయించిన షెడ్డుల తొలగించారు. ఫుల్ ఫోర్స్ తో రంగంలో దిగిన హైడ్రా..ఆదివారం ఉదయం నుంచే ఆక్రమణలు తొలగింపు చేపట్టారు.

### గాజులరామారంలో తీవ్ర ఉద్రిక్తత

## హైడ్రా జేసీబీలపై స్థానికుల రాళ్ల దాడి




హైదరాబాద్ శివారు గాజులరామారంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. హబీబ్ బస్తీ, బాలయ్య నగర్, గాలిపోచమ్మ బస్తీ, సాయిబాబా బస్తీలో ప్రభుత్వ భూముల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ఈ క్రమంలో హైడ్రా కూల్చివేతలను వ్యతిరేకిస్తూ స్థానికులకు ఆందోళనకు దిగారు. హబీబ్ బస్తీలో మరింత రెచ్చిపోయిన స్థానికులు కూల్చివేతలు జరుపుతున్న అధికారులు, జేసీబీలపై రాళ్లతో దాడి చేశారు. స్థానికుల రాళ్ల దాడిలో హైడ్రా జేసీబీ అద్దాలు ధ్వంసం అయ్యాయి. కొందరు పోలీసులు స్వల్పంగా గాయపడ్డారు. రాళ్ల దాడి చేసిన వారిలో కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దీంతో పోలీసులు, అధికారులతో స్థానికులు ఆందోళనకు దిగారు. ఈ పరిణామంతో గాజులరామారంలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. మరోవైపు స్థానికులు తమ ఇండ్లు కూలగొట్టదని అధికారులను వేడుకుంటున్నారు. ఇవాళ బతుకమ్మ పండగ కాదు మా శవాల పండగ అని.. పండగరోజు పండగ లేకుండా చేసారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

# కొత్త జీఎస్టీ: ధరలు తగ్గే వస్తువులు ఇవే..




జీఎస్టీ సంస్కరణలు (సెప్టెంబర్ 22) నుంచే అమలులోకి రానున్నాయి. దీంతో వంటగదిలో ఉపయోగించే వస్తువుల దగ్గర నుంచి ఎలక్ట్రానిక్స్ వరకు, మందుల (మెడిసిన్స్) దగ్గర నుంచి ఆటోమొబైల్స్ వరకు చాలా వస్తువుల ధరలు తగ్గనున్నాయి. వినియోగదారులకు వరంలాగా జీఎస్టీ కౌన్సిల్.. నవరాత్రి మొదటి రోజు నుంచి రేట్లను తగ్గించాలని నిర్ణయించింది. ధరలు తగ్గనున్న వస్తువుల జాబితాలో నెయ్యి, పనీర్, వెన్న, నామ్‌కీన్, కెచప్, జామ్, డ్రై ఫ్రూట్స్, కాఫీ, ఐస్ క్రీములు వంటివాటితో పాటు.. టీవీ, ఏసీ, వాషింగ్ మెషీన్స్ కూడా ఉన్నాయి. ఔషధాలు, గ్లూకోమీటర్లు, డయాగ్నోస్టిక్ కిట్‌ల ధరలు తగ్గనున్నాయి. సిమెంట్ 18 శాతం జీఎస్టీ పరిధిలోకి రావడంతో గృహనిర్మాణదారులు ప్రయోజనం పొందుతారు. జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత, ఫార్మసీలు తమ ఎం ఆర్ పి ని సవరించాలని లేదా తక్కువ రేటుకు మందులను విక్రయించాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. జీఎస్టీ రేటు తగ్గింపు వల్ల ఆటోమొబైల్ కొనుగోలుదారులు లాభపడతారు. ఇప్పటికి దాదాపు అన్ని కార్ల కంపెనీలు తగ్గిన ధరలను వెల్లడించాయి. ఇవి రేపటి నుంచే అమలులోకి రానున్నాయి. జీఎస్టీ సంస్కరణలు మాత్రమే కాకుండా ఫెస్టివల్ ఆఫర్స్ లేదా బెనిఫిట్స్ కూడా ఇప్పుడు వాహన కొనుగోలుదారులకు చాలా అనుకూలంగా మారనున్నాయి. హెయిర్ ఆయిల్, టాయిలెట్ సబ్బు బార్లు, షాంపూలు, టూత్ బ్రష్, టూత్ పేస్టు, టాల్కమ్ పౌడర్, ఫేస్ పౌడర్, షేవింగ్ క్రీమ్, ఆఫ్టర్-షేవ్ లోషన్ వంటి ఇతర రోజువారీ వినియోగ వస్తువుల ట్యాక్స్ తగ్గడంతో.. ధరలు మరింత చౌకగా మారనున్నాయి.

## వైఫల్యాలను సరిదిద్దుతాం



జెన్ జెడ్ ఆందోళనలకు దారితీసిన వైఫల్యాలను సరిదిద్దుతానని నేపాల్ తాత్కాలిక ప్రధాని సుశీలా కర్కి శుక్రవారం స్పష్టం చేశారు. అవినీతిపై పోరాడతానని, ఉద్యోగాలు సృష్టిస్తామని, జీవన ప్రమాణాలను పెంచుతామని ప్రతిజ్ఞ చేశారు. 10 ఏళ్ల క్రితం ఇదే రోజు అమలులోకి వచ్చిన ప్రస్తుత రాజ్యాంగానికి గుర్తుగా శుక్రవారం నిర్వహిస్తున్న నేపాల్ జాతీయ దినోత్సవం సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం సుశీల్ కర్కి మొదటి బహిరంగ సభ ఇది కావడం గమనార్హం. ఉపాధి అవకాశాలను సృష్టించడం, జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, ప్రభుత్వ పాలనలో పారదర్శకత, అవినీతి నియంత్రణ మరియు అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ నిరసనలు యువత ఆకాంక్షలను ప్రతిబింబిస్తాయని, పెరుగుతున్న అవినీతిపెప్రజల అవగాహన, అసంతృప్తి స్థాయిలను ప్రతిబింబిస్తాయని అన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన సుపరిపాలన శ్రేయస్సును అందించే స్ఫూర్తి మరియు లక్ష్యాలను నెరవేర్చడంలో విఫలమైనందున ఆందోళను జరిగాయన్న వాస్తవాన్ని మనం అంగీకరించాలని అన్నారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి అయిన సుశీలా కర్కి నేపాల్ ప్రధాని పదవిని చేపట్టిన ఏకైక మహిళ , నేపాల్ ప్రభుత్వానికి నేతృత్వం వహించిన మొదటి మహిళ కూడా. ఈ నెల ప్రారంభంలో జెన్ జెడ్ ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో కె.పి.శర్మఓలి ప్రభుత్వం కుప్పకూలిన సంగతి తెలిసిందే. ఈ ఆందోళనల్లో 72 మంది మరణించగా, 2,100 మందికి పైగా గాయపడ్డారు.

# అమ్మా..అమానుషం



ఎంత కష్టం వచ్చిందో కానీ.. ముద్దులొలికే పసిపిల్లలను తల్లి తన చేతులతో చంపి, తనువు చాలించింది. భర్త, అత్త వేధింపులను తట్టుకోలేక ఈ ఘాతుకానికి పాల్పడిన హృదయ విదారక దుర్ఘటన తుమకూరు జిల్లాలోని పావగడ తాలూకాలోని కడపలకెరె గ్రామంలో శనివారం మధ్యాహ్నం జరిగింది. సరిత (25), కుమారుడు పుష్విక్ (4), కూతురు యుక్తి (2) మృతులు. ఏం జరిగిందంటే. వివరాలు.. కడపలకెరె గ్రామానికి చెందిన సరితకు స్థానికుడు సంతోష్‌తో ఆరేళ్ల కిందట పెద్దలు పెళ్లి చేశారు. భర్త ప్యాసింజర్ ఆటోను నడుపుతుండగా, సరిత గృహిణి. ఆమె అత్త అంజమ్మ పట్టణం లో వ్యవసాయ పరిశోధన కార్యాలయంలో డీ గ్రూప్ ఉద్యోగి గా పని చేస్తోంది. భర్త, అత్త కలిసి సరితను సూటిపోటి మాటలతో వేధించేవారని సమాచారం. దీంతో జీవితంపై విరక్తి చెందిన సరిత ఇంటిలో ఎవరూ లేని సమయంలో.. కొడుకును కత్తితో గొంతుకోసి హతమార్చింది. తరువాత కూతురికి ఉరివేసి చంపి, ఆపై తాను ఉరికి వేలాడింది. స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మధుగిరి పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. ఈ ఘోరంతో గ్రామంలో విషాదం అలముకొంది.

### భారత్‌పై అమెరికా విధించిన భారీ టారిఫ్‌లను వ్యతిరేకిస్తూ

## రష్యా విదేశాంగ శాఖ మంత్రి సెర్గీ లావ్‌రోవ్ సంచలన వ్యాఖ్యలు

రష్యా నుంచి చమురు కొంటున్న భారత్‌పై అమెరికా విధించిన భారీ టారిఫ్‌లను వ్యతిరేకిస్తూ రష్యా విదేశాంగ శాఖ మంత్రి సెర్గీ లావ్‌రోవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్, చైనాల వంటి పురాతన నాగరికతలు కలిగిన దేశాలు బెదిరింపులకు లొంగవని ఆయన స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో రష్యా-అమెరికాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు, రష్యా-భారత్ మధ్య మరింత బలపడ్డ స్నేహం నేపథ్యంలో లావ్‌రోవ్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. రష్యాకు చెందిన ప్రధాన టీవీ ఛానెల్ ది గ్రేట్ గేమ్ కార్యక్రమంలో మాట్లాడుతూ లావ్‌రోవ్.. అమెరికా విధించిన టారిఫ్‌లపై ఘాటుగా స్పందించారు. 'చైనా, భారత్ రెండూ పురాతన నాగరికత కలిగిన దేశాలు. నాకు నచ్చినది చేయకండి లేకపోతే.. టారిఫ్‌లు విధిస్తామని చెప్పి బెదిరించడం ఆ దేశాల విషయంలో పనిచేయదు.' అని ఆయన అన్నారు. అమెరికా తన విధానాల వల్ల ఈ రెండు దేశాలకు ఆర్థికంగా నష్టం కలిగించేందుకు అమెరికా ప్రయత్నిస్తోందని అన్నారు. అయితే టారిఫ్‌ల వంటి చర్యలు ఆ దేశాలను మార్కెట్, ఇంధనం వంటి రంగాల్లో ప్రత్యామ్నాయాల వైపు మళ్లిస్తాయని ఆ ఇంటర్వ్యూలో లావ్‌రోవ్ పేర్కొన్నారు. రష్యాపై కొత్త ఆంక్షల విషయంలో ఎటువంటి సమస్య కనిపించడం లేదని అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదటి హయాంలో ఎన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున ఆంక్షలు విధించినట్లు గుర్తు చేశారు. బైడెన్ పదవీ కాలంలో.. ఆయా వ్యవహారాల్లో దౌత్య ప్రయత్నాలకు బదులుగా ఆంక్షలు ప్రయోగించారని, రాజీ కోసం ఎటువంటి ప్రయత్నాలు చేయలేదని లావ్‌రోవ్ పేర్కొన్నారు. అయితే.. అమెరికా ఇటీవల భారత్‌పై 50 శాతం టారిఫ్‌లను విధించిన సంగతి తెలిసిందే. ఈ టారిఫ్‌ల ప్రభావం రొయ్యలు, వస్త్రాలు, తోలు, పాదరక్షల వంటి రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

## నరేంద్ర మోడీ జన్మదినంసందర్భంగా బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నశా ముక్త యువ వికాస భారతదేశం కార్యక్రమం




**వేములవాడ సెప్టెంబర్ 21 ( మన వార్త ప్రతినిధి )** వేములవాడ ప్రజాపిత బ్రహ్మాకుమారీస్ ఈశ్వరియ విశ్వవిద్యాలయం యూత్ వింగ్ నుండి భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా నశా ముక్త యువ వికాస భారతదేశం కోసం కార్యక్రమాన్ని వేములవాడ బ్రహ్మకుమారీస్ సెంటర్ లో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో భాగంగా వేములవాడ పట్టణంలో ఉన్న యువకుల తో స్వదేశీ వస్తువులే వాడతామని, విదేశీ వస్తువులను వాడకూడదని, ఆరోగ్యానికి హాని కలిగించే దుర అలవాట్లకు దూరంగా ఉంటామని, ఎటువంటి మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉంటామని యువకులచే ప్రతిజ్ఞ చేయించడం జరిగింది అలాగే వేములవాడ సెంటర్ ఇన్చార్జి బికే రమాదేవి, బి కే నళిని మాట్లాడుతూ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు నిర్భర భారత్ కోసం నశా ముక్త యువ వికాస భారతదేశం కార్యక్రమం నిర్వహించడం జరిగిందని మద్యం, పొగాకు మనల్ని బానిసలుగా చేసుకున్నట్లే, విదేశీ వస్తువులపై ఆధారపడటం కూడా అంతే బానిసలుగా మారుతుంది. వ్యసనం, విదేశీ వస్తువులను తినే అలవాటు రెండూభారతదేశాన్నిబలహీనపరుస్తాయి, కాబట్టి మనం స్వావలంబన పొందాలనుకుంటే, మనం వ్యసనాన్ని వదిలివేసి స్వదేశీ ఉత్పత్తులను స్వీకరించాలి ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులు వాడాలి విదేశీవస్తువులుబహిష్కరించాలని, చెడు అలవాట్లకు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణానికి చెందిన యువకులు, బ్రహ్మకుమారిలు, బ్రహ్మకుమారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని కాపాడండి



**–తాసిల్దార్ కు గ్రామస్తుల వినతిపత్రం..**

**చిన్న శంకరంపేట సెప్టెంబర్ 20( మన వార్త ప్రతినిధి)**

ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ గ్రామస్తులు శనివారం తాసిల్దార్ మాలతికి వినతి పత్రాన్ని అందజేశారు మండలంలోని అంబాజీపేట గ్రామ శివారు లోని దుర్గామాత దేవాలయం పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి గ్రామ కంఠం కు చెందిన భూమిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకొని ప్రహరీ గోడను ఏర్పాటు చేసుకుంటున్నారని ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ గ్రామస్తులు తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు, ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన రామకృష్ణ బాబు యాదగిరి, అశోక్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## SGF రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన వివేకానంద విద్యార్థిని



**రామయంపేట,సెప్టెంబర్ 21( మన వార్త ప్రతినిధి)** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా బ్యాడ్మింటన్ పోటీలలో రామయంపేట పట్టణంలోని వివేకానంద విద్యాలయంకు చెందిన 9వ తరగతి విద్యార్థిని పి.వర్షిని అండర్–17 బాలికల విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, విజేతగా నిలిచింది. ఇందుకుగానూ త్వరలో నిర్వహించబోయే రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో ఉమ్మడి మెదక్ జిల్లా తరపున పాల్గొననున్నది. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని వర్షిని ని, సహకరించిన పీఈటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.రామ్ కుమార్ అభినందిస్తూ రాష్ట్రస్థాయిలో కూడా విజయం సాధించి జిల్లాకు, మండలానికి పాఠశాలకు తల్లిదండ్రులకు పేరు, ప్రతిష్టలు, తీసుకురావాలన్నారు.

## బిజెపి మహిళ మోర్చా నాయకురాలు పిండేరు భానుప్రియ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీ



**జగిత్యాల,సెప్టెంబర్ 21 (మన వార్త ప్రతినిధి)** ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా దేశవ్యాప్తంగా బిజెపి చేపట్టిన సేవా పక్షం 2025 లో భాగంగా బిజెపి మహిళా మోర్చా నాయకులు జగిత్యాల పట్టణ ఇంచార్జ్ పిండేరు భానుప్రియ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించడం జరిగింది.విద్యార్థిని విద్యార్థులు దేశభక్తిని చాటుతూ చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్నారు. జగిత్యాల నారాయణ పాఠశాలకు చెందిన విద్యార్థిని లింగ హర్షిని మొదటి బహుమతిని గెలుచుకోవడంతో తల్లిదండ్రులతో పాటు పలువురు ప్రశంసలను పొందింది. పోటీలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు బిజెపి నాయకులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవాపక్షం జిల్లా కన్వీనర్ రాగిళ్ల సత్యనారాయణ , బిజెపి పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్, ప్రధాన కార్యదర్శి ఆముదరాజు, కోశాధికారి దశరథం రెడ్డి, కార్యదర్శి కళావతి, బిజెపి సోషల్ మీడియా ఇంచార్జ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# అక్కన్నపేటలో షకని రామవ్వ మృతి



**–బాధిత కుటుంబానికి యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ఆర్థిక సహాయం...**

**రామాయంపేట, సెప్టెంబర్ 21 ( మన వార్తా ప్రతినిధి)**

మెదక్ జిల్లా రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామానికి చెందిన షకని రామవ్వ అనారోగ్యంతో ఇటీవల కన్నుమూశారు.రామవ్వ మరణ వార్త తెలుసుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించిన యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కుమార్ సాగర్ మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు,రామవ్వ మరణంతో కుటుంబం కష్టాల్లోకి నెట్టబడి ఉందని గుర్తించి,తమ వంతు సహకారంగా ఆర్థిక సాయం అందించామని ఆయన తెలిపారు..ఇలాంటి సందర్భాల్లో సమాజంలోని ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబానికి అండగా ఉంటామని మనోధైర్యాన్ని కల్పించారు, ఈ కార్యక్రమంలో గ్రామంలోని యువత,స్థానిక ప్రజలు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొని కుమార్ సాగర్ సేవాభావాన్ని ప్రశంసించారు.

## మధుయాష్కీ గౌడ్ ను పరామర్శించిన టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 21( మన వార్త ప్రతినిధి )** హైద్రాబాద్ ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురై చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న కాంగ్రెస్ సీనియర్ నేత, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ మధుయాష్కీ గౌడ్ ను శనివారం వారి స్వగృహంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు మర్యాదపూర్వకంగా కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

# దుర్గామాత మండపాలకు అనుమతి తప్పనిసరి



**మునగాల, సెప్టెంబర్ 21(మన వార్త ప్రతినిధి)**

దుర్గామాత మండపాలకు ముందస్తుగా పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని మునగాల ఎస్సై ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ..మండల వ్యాప్తంగా మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు **https://policeportal.tspolice.gov.in/index .htm** లింకు లో కమిటీల వివరాలను నమోదు చేసి ఒక కాపీ ప్రింట్ తీసి స్థానిక పోలీస్ స్టేషన్ లో అందజేయాలన్నారు.అప్లికేనలో సూచించిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ,ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రధాన రోడ్లల్లో మండపాలలో ఏర్పాటు చేయవద్దన్నారు. రహదారులను క్లియర్ గా ఉంచాలన్నారు. విద్యుత్ కనెక్షన్ సురక్షితంగా అమర్చాలని అగ్ని ప్రమాదాల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. డీజే లకు ఎలాంటి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి సౌండ్ సిస్టం పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## భారత్ నగర్ హనుమాన్ ఆలయంలో ఆహార భద్రతా కార్డుల పంపిణీ




**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, సెప్టెంబర్ 21 మన వార్త :** భారత్ నగర్ హనుమాన్ ఆలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో లబ్దిదారులకు ఆహార భద్రతా కార్డులు (రేషన్ కార్డులు) పంపిణీ చేయబడినాయి.ఈ కార్యక్రమం మైనంపల్లి హనుమంత్ రావు నాయకత్వంలో,అలాగే అల్వాల్ సర్కిల్ కాంగ్రెస్ సీనియర్ లీడర్, సోషల్ యాక్టివిస్ట్ తుడిమెల్ల మల్లికార్జున్ ఆధ్వర్యంలో జరిగింది. 46 మంది మహిళలకు కార్డుల పంపిణీ ఈ కార్యక్రమంలో భాగంగా రాజీవ్ గృహ కల్ప, భారత్ నగర్ మరియు వంబాయ్ కాలనీలకు చెందిన 46 మంది మహిళలకు ఆహార భద్రతా కార్డులు అందజేయబడినాయి. దీని ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత చేరువవుతాయని నిర్వాహకులు తెలిపారు. పథకాల ద్వారా లభించే ప్రయోజనాలు ఈ సందర్భంగా మాట్లాడిన తుడిమెల్ల మల్లికార్జున్ ఆహార భద్రతా కార్డు కేవలం రేషన్‌కే పరిమితం కాదు.దీని ద్వారా ఆరోగ్య పథకాలు,విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు,విద్యుత్ బిల్లులో 200 యూనిట్ల వరకు రాయితీ, అలాగే గృహ నిర్మాణ పథకాలు వంటి ఎన్నో ప్రయోజనాలు లభిస్తాయి. ఈ పథకాలన్నీ పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు నిజమైన ఆధారం అవుతాయి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో దండువాటే సునీత, తిమ్ముబాయి జటలే, మీనా జగన్నాథ్, నాగాబాయి, జ్యోతి జటలే, బాలమణి, శివరాజ్, శంకర్, సైలు, దాస్, జగన్ తదితరులు పాల్గొని తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు.సంక్షేమం కోసం కృషి కార్యక్రమం ముగింపులో నేతలు మాట్లాడుతూ,ప్రజలకు నిరంతర సేవ చేస్తూ సంక్షేమం కోసం కృషి చేయడం మా ప్రధాన కర్తవ్యంగా భావిస్తున్నాము.ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న పథకాల ప్రయోజనం చేరేలా మరింత కృషి చేస్తాం అని పునరుద్ఘాటించారు.

## న్యూ మేడ్చల్ మల్కాజ్‌గిరి స్పోర్ట్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం విజయవంతం




**మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, సెప్టెంబర్ 21 మన వార్త:** న్యూ మేడ్చల్ మల్కాజ్‌గిరి స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశం బాపూజీ నగర్, బోయిన్ పల్లి లోని కీన్ టైక్వాండో అకాడమీ వేదికగా నిర్వహించబడింది.హాజరైన నాయకులు మరియు సభ్యులు ఈ సమావేశానికి అధ్యక్షుడు బి. నరేష్,ఉపాధ్యక్షుడు కె.పి. హనుమంతు ప్రధాన కార్యదర్శి డబ్ల్యూ. రాహుల్ వి జాయింట్ సెక్రటరీ ఎం. హేమంత్, ట్రెజరర్ ఎల్. నరేష్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు సంతోష్ గౌడ్, మొహమ్మద్ అబ్దుల్ ముజీబ్ తో పాటు పలువురు కోచ్‌లు హాజరయ్యారు.సమావేశంలో రాబోయే ఛాంపియన్‌షిప్ మరియు భవిష్యత్తు క్రీడా కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ప్రతి కోచ్ మరియు సభ్యుడు తమ అభిప్రాయాలను పంచుకుని, విజయవంతమైన కార్యక్రమాల నిర్వహణ కోసం విలువైన సూచనలు చేశారు. అధ్యక్షుడు నరేష్ మాట్లాడుతూ,విద్యార్థులు క్రీడలలో ప్రతిభ కనబరిచేందుకు కోచ్‌లు స్నేహితులుగా, మార్గనిర్దేశకులుగా ఉండాలి. ఇది క్రీడాకారుల భవిష్యత్తుకు దారిదీపమవుతుంది. రాబోయే ఛాంపియన్‌షిప్‌లో అందరూ విశేష ఫలితాలు సాధించాలని మనసారా కోరుకుంటున్నాను అని అన్నారు. ఆయన అన్ని కోచ్‌లకు శుభాకాంక్షలు తెలియజేశారు.మన జిల్లాలోని అన్ని కోచ్‌లు ఈ సమావేశానికి హాజరై దానిని విజయవంతంగా నిర్వహించారు. క్రీడల అభివృద్ధి కోసం సంయుక్తంగా కృషి చేయాలని నిర్ణయించారు.

## నవ దాండియా వేడుకలకు మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆహ్వానితం




**మేడ్చల్–మల్కాజ్గిరి జిల్లా, సెప్టెంబర్ 20 (మనవార్త):** అల్వాల్ జిహెచ్ఎంసి పరిధిలో మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి రాబోయే నవదాండియా వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని నిర్వాహకులు ఘనంగా అందజేశారు. ఈ కార్యక్రమం రాచకొండ వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ప్రతి సంవత్సరం లాగే ఈ సారి కూడా ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరుకావడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ముఖ్యంగా యువత, మహిళలు, పిల్లలు భారీ సంఖ్యలో పాల్గొని సాంస్కృతిక వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చుతారని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.సమాజంలో ఆనందం, సాంస్కృతిక ఏకతకు ప్రతీక నవ దాండియా వేడుకలు సమాజంలో ఆనందాన్ని, స్నేహభావాన్ని పెంపొందించడమే కాకుండా సాంస్కృతిక ఏకతకు ప్రతీకగా నిలుస్తాయని నిర్వాహకులు వివరించారు. భిన్న ప్రాంతాల నుండి వచ్చే ప్రజలు ఒకే వేదికపై కలిసి నృత్యం చేయడం ద్వారా సామరస్య వాతావరణం నెలకొంటుందని చెప్పారు.అదేవిధంగా, స్థానిక కళాకారులు, డీజే ప్రోగ్రాములు, సాంస్కృతిక ప్రదర్శనలు ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు ఆహ్వానం స్వీకరించిన ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి సాంప్రదాయాలను కాపాడుతూ సమాజాన్ని కలుపుకునే ఈ తరహా కార్యక్రమాలు ఎల్లప్పుడూ అభినందనీయమైనవి అని వ్యాఖ్యానించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై ఆనందంగా గడపాలని ఆయన కోరారు.స్థానిక ప్రజలు, యువత, మహిళలు ఈ వేడుక కోసం ఆతృతగా ఎదురుచూస్తూ, ఈ సారి జరిగే నవదాండియా మరింత ప్రత్యేకంగా ఉంటుందని నమ్మకం వ్యక్తం చేస్తున్నారు.

## బాక్స్ డ్రైనేజ్ రోడ్డు సమస్యలపై ఎమ్మెల్యే కు లక్ష్మణ్ యాదవ్ వినతి పత్రం అందజేశారు



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 21 మన వార్త :** అల్వాల్ సర్కిల్ 133 డివిజన్ మచ్చ బొల్లారం కౌకుర్ లోని కింది బస్తీ బాక్స్ డ్రైనేజ్ మరియు రోడ్డు సమస్యలపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసి భేటీ అయ్యారు.ఈ సందర్భంగా లక్ష్మణ్ యాదవ్,మల్లేశ్ యాదవ్,తిరుపతి రావు, నమదాస్ వెంకటస్వామి, హైమత్ , శంకర్, సతీష్, శ్రీనివాస్ రెడ్డి, రాములు తదితరులు సమస్యలను ఎమ్మెల్యే కి వివరించారు.ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆలకించిన ఎమ్మెల్యే వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని భరోసా ఇచ్చారు. స్థానికులు త్వరలో సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకం వ్యక్తం చేశారు.

# గురువులను సన్మానించిన విద్యార్థులు



**మునగాల, సెప్టెంబర్ 21 (మన వార్త ప్రతినిధి)** ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చిన సందర్భంగా మునగాల మోడల్ స్కూల్ లో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన రాజుల లక్ష్మీనారాయణ,పీర్ సాహెబ్ ను మోడల్ స్కూల్ పూర్వ విద్యార్థులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానం చేశారు.అనంతరం ఆశీస్సులు తీసుకున్నారు.గురువులు మాట్లాడుతూ..విద్యార్థులు నేర్పిన గురువులను మర్చిపోకుండా గుర్తుపెట్టుకుని సన్మానం చేయటం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమానికి మధు, సంపత్,సందీప్,సందీప్, అనూష,శాలిని,తదితరులు హాజరయ్యారు.

## మాజీ ఎంపీపీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నంది విగ్రహ ప్రతిష్ఠ




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 21( మన వార్త ప్రతినిధి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలంలోని అంజనాపురం గ్రామపంచాయతీ చీమన్న తండలో అమావాస్య సందర్భంగా పత్తింగ్రీ మాత అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం శనివారం ఎంతో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామస్తులు సన్నాహాలు చేసి ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి భక్తులు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం నంది విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం కూడా నిర్వహించగా, గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ సందర్భంలో ముఖ్య అతిథిగా కొత్తగూడెం డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. భక్తుల ఉత్సాహం చూసి ఆనందం వ్యక్తం చేసిన ఆయన, గ్రామ ప్రజల ఐకమత్యం ప్రశంసనీయమని అన్నారు. ఈ తరహా ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, సౌహార్ద వాతావరణం నెలకొల్పుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు భూక్య అర్జనాయక్, భూక్య శ్రీరామ్, అతిరం రామారావు, బిఆర్ఎస్ యువజన నాయకులు ఇర్ఫాన్ తదితరులు పాల్గొని విజయవంతం చేశారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, మహిళలు, యువత భాగస్వామ్యంతో ఈ పూజా వేడుక చీమన్న తండలో గ్రామోత్సవంలా మారింది.

## తెలంగాణ రాష్ట్రంలో మైనార్టీలకు రెండు కొత్త పథకాలు



**చేవెళ్ల :సెప్టెంబర్ 21 మన వార్త ప్రతినిధి.** రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం రెండు కొత్త పథకాలు ప్రారంభించింది.ఈ పథకాలను అర్హులైన మైనార్టీలు సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ చాన్ పాషా అన్నారు. ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన పేరుతో ఒంటరి మహిళలు, వితంతువులు, అనాధ మహిళలకు రూ. యాభై వేలు ఆర్థిక సహాయం ఫకీర్, దూదేకుల, వంటి వెనుకబడిన వర్గాలకు రూ. లక్ష రూపాయలు గ్రాండ్ తో మోపేడ్స్ ఇవ్వనుంది అర్హులైన వారు 19 సెప్టెంబర్ 2025 నుండి 6అక్టోబర్ 2025 వరకు **tgobmms.cgg.gov.in**లో దరఖాస్తు చేసుకోవచ్చు దరఖాస్తు చేసుకోవడానికి కావలసిన పత్రాలు ఆధార్ కార్డు, ఫుడ్ సెక్యూరిటీకార్డు,పాన్ కార్డు ఫోటో ఇన్కమ్ సర్టిఫికెట్/ఆప్షనల్ విడాకుల సర్టిఫికెట్ డెత్ సర్టిఫికెట్ కచ్చితంగా ఉండాలన్నారు.

# పితృపక్షాల్లో పెద్దలకు బియ్యం



**మల్యాల, సెప్టెంబర్ 21(మన వార్త ప్రతినిధి)** మల్యాల మండలంలో పితృపక్షాల్లో భాగంగా చనిపోయిన పూర్వీకుల పేరుమీద బియ్యం, కూరగాయలు వగైరా సమర్పించి ఆశీర్వచనాలు పొందుతున్నట్లు గ్రామ పురోహితులు ప్రణీత్ శర్మ తెలిపారు. దీంతో పితృదేవతలకు మోక్షం లభిస్తుందని, పితృపక్షాల్లో ఈ 15 రోజులు చనిపోయిన వాళ్ళు భూమి మీదకు వచ్చి వారి కుటుంబసభ్యులను దర్శిస్తారని పురాణాలు చెబుతున్నట్లు పురోహితులు పేర్కొన్నారు. నేడు మహాలయ అమావాస్య సందర్భంగా చివరి రోజు కావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

## అయ్యప్ప ఆలయంలో భక్తులకు ప్రసాద వితరణ



**మల్యాల, సెప్టెంబర్ 21(మన వార్త ప్రతినిధి )** అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి మల్యాల శాఖ ఆధ్వర్యంలో స్థానిక హరిహరపుత్ర అయ్యప్ప స్వామి క్షేత్రమునందు భక్తులకు ఆదివారం ప్రసాద వితరణ గావించారు. మహాలయ అమావాస్యను పురస్కరించుకొని అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఇకనుంచి ప్రతి అమావాస్య రోజున భక్తులకు ప్రసాదాన్ని అందజేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు మిట్టపల్లి లక్ష్మీనారాయణ, గుండేటి మోహన్ తెలిపారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం




**కోదాడ సెప్టెంబర్ 21 (మన వార్త ప్రతినిధి)** చిన్ననాటి జ్ఞాపకాలు మరువలేనివని ఆనాటి రోజులను స్నేహితులు గుర్తుచేసుకొని ఒకరికొకరు ఆప్యాయంగాపలకరించుకుటూ సందడిగా గడిపారు. మఠంపల్లి వివేక వర్ధిని హైస్కూల్లో 1976-1977 బ్యాచ్ కు చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కోదాడ పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ సందడిగా గడిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యతోపాటు నైతిక విలువలకు కట్టుబడి ఉంటేనే జీవితం సాఫీగా సాగుతుందని అన్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గుర్తు చేసుకొని నాడు ఉపాధ్యాయులు నేర్పిన క్రమశిక్షణతోనే తాము ఉద్యోగాలు సాధించి వివిధ రంగాల్లో స్థిరపడ్డామని చెప్పారు. ఈకార్యక్రమంలో ముత్తినేని సైదేశ్వరరావు, తాటికొండ కృష్ణారెడ్డి, కోటిరెడ్డి,తీగల చంద్రశేఖర్ రెడ్డి, తిప్పన వెంకటరెడ్డి, మధుసూదన్ రావు,సుధాకర్ రెడ్డి, వేణుగోపాలరావు, క్లైమేన్స్, పుష్ప,దుర్గా భవాని తదితరులు పాల్గొన్నారు.

# గోపిరెడ్డి నగర్ లో ఎంగిలి పువ్వు బతుకమ్మ ఆట



**కోదాడ సెప్టెంబర్ 21 (మన వార్త ప్రతినిధి)** కోదాడ పట్టణంలోని గోపిరెడ్డి నగర్ లో మహిళలకు అత్యంత ఇష్టమైన పండుగ బతుకమ్మ ఆటపాట.కాగా ఆదివారం నుండి ప్రారంభమయ్యే ఎంగిలిపువ్వు బతుకమ్మ ఆటపాటకు మైదానం సిద్ధం చేశారు. బతుకమ్మ పండుగ లో భాగంగా తొలి రోజు ఉదయం తులసి వెంపలి చెట్లకు స్థానిక మహిళలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాంప్రదాయపరంగా తొలి రోజు ఈ ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. కాగా గోపిరెడ్డి నగర్ లో ఇంటింటా బతుకమ్మ పండుగ సందడి నెలకొన్నది. పాఠశాలలకు సెలవులు రావడం బంధువులు మిత్రులతో ఇళ్లలో సందడిగా ఉంది. స్థానిక పెద్దలు బతుకమ్మ పండుగ ఏర్పాట్లకు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈ కార్య క్రమంలో స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కామాక్షి మొబైల్ షాప్ లో దసరా పండుగ ఆఫర్లు



**గజ్వేల్ సెప్టెంబర్ 21 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో కామాక్షి మొబైల్ షాప్ వారి ఆధ్వర్యంలో బతుకమ్మ, దసరా , దీపావళి పండుగ ఆఫర్స్ అందుబాటులో ఉన్నాయని యాజమాన్యం సంపత్,శ్రవణ్,అన్వేష్ మాట్లాడుతూ గజ్వేల్ మరియు పరిసర ప్రాంతాల ప్రజలకు సువర్ణ అవకాశం అని తక్కువ ధరకు నాణ్యమైన మొబైల్స్ అందుబాటులో ఉన్నాయని, అన్ని రకాల మొబైల్ పరికరాలు అందుబాటులో ఉన్నాయని, మొబైల్ రిపేర్ చేయడానికి మొబైల్ రిపేర్ చేసే నిష్ణాతులు ఉన్నారని, లక్కీ డీప్ ద్వారా బైక్ తో పాటు కన్సోలేషన్ బహుమతులు ఉన్నాయని ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు.

# భద్రాచలంలో "సంగీత లహరి"గా ఎస్పీబీ స్మరణ సభ



**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 21, మన వార్త ప్రతినిధి. ( టి ఎస్ ఎస్ సుబ్రహ్మణ్యం).** భద్రాచలం పట్టణంలోని గుప్త ఫంక్షన్ హాల్లో ఆదివారం కీర్తిశేషులు ఎస్.పి. బాలసుబ్రమణ్యం వర్ధంతి సందర్భంగా "సంగీత లహరి" కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని నటరాజ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో సంగీతాభిమానుల సమక్షంలో నిర్వహించారు. ఆత్మీయ ముఖ్య అతిథులుగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నాగేష్, భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ తెల్లం వెంకట్రావు, టిపిసిసి సభ్యులు బుడగం శ్రీనివాస్ జ్యోతిని వెలిగించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం పలువురు సంగీతకారులు తమ మధుర గానంతో శ్రోతలను అలరించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి జస్టిస్ భీమపాక నాగేష్ మాట్లాడుతూ, "ఎన్నో వేల పాటలు తన గాత్రంతో తెలుగు గౌరవాన్ని పెంచిన ఎస్.పి బాల సుబ్రమణ్యం స్మృతిలో ఈ కార్యక్రమాన్ని భద్రాచలంలో నిర్వహించడం నాకు గర్వకారణం. రాబోయే ఏడాది ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా నిర్వహించాలి. ఇలాంటి వేడుకలు యువ కళాకారులను ప్రోత్సహించేందుకు మంచివేదిక అవుతాయి" అని అన్నారు. అలాగే కార్యక్రమాన్ని నిర్వహించిన నటరాజ్ ఈవెంట్స్ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. పట్టణ ప్రముఖులు, గాయకులు, సంగీతాభిమానులు పాల్గొన్నారు.

## భద్రాచలంలో డైలీ వేజ్ వర్కర్ల సమ్మెకు మద్దతుగా జీఎస్పి




**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 21, మన వార్త ప్రతినిధి. ( టి. ఎస్. ఎస్. సుబ్రహ్మణ్యం).** జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లు నిరవధిక సమ్మెకు దిగిన శిబిరాన్ని ఆదివారం భద్రాచలం ఐటిడిఏ కార్యాలయం ముందు సందర్శించిన గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ, భద్రాచలం బాస్ కమిటీ అధ్యక్షులు పూణేం కృష్ణదొర సంఘీభావం ప్రకటించారు. ఇప్పటికే పది రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ అధికారులు సమస్య పరిష్కారంలో ఎటువంటి ఆసక్తి చూపకపోవడం పట్ల వారు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. దీంతో పాటు డైలీ వేజ్ శ్రామికులను రెగ్యులర్ చేసి, జీతాలు పెంచాలని, ప్రతి నెలా జీతాలు సమయానికి విడుదల చేయాలని, మానవతా దృక్పథంతో అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి..



**మల్యాల, సెప్టెంబర్ 21(మన వార్త ప్రతినిధి)** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 13వ వర్ధంతిని పురస్కరించుకొని మల్యాల మండల కేంద్రంలోని స్థానిక బ్లాక్ చౌరస్తా వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. పద్మశాలీ ముద్దుబిడ్డ బాపూజీ దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించాడని తెలిపారు. తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఊపిరి అందించిన మహనీయుడని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం మంత్రి పదవిని వదులుకున్న బాపూజీ అన్ని సామాజిక వర్గాలకు ఆదర్శనీయుడన్నారు. నివాళి అర్పించిన వారిలో పద్మశాలి సంఘం కార్యవర్గ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, పద్మశాలి కులస్తులు, గ్రామ ప్రజలు ఉన్నారు.

## కొమరం భీం కాలనీవాసుల పాదయాత్రకు ఆవాజ్, సేవ్ కొత్తగూడెం సేవ్ కార్పొరేషన్ మద్దతు



**భద్రాద్రి జిల్లా కొత్తగూడెం ,సెప్టెంబర్ 22 :(మన వార్తా ప్రతినిధి):** కొత్తగూడెం జిల్లాలోని చుంచుపల్లి మండల పరిధిలో వెంకటేశ్వర కాలనీ ప్రాంతంలో గత ఐదు సంవత్సరాలుగా గుడిసెలు వేసుకొని నివసిస్తున్న కొమరం భీం కాలనీవాసుల పాదయాత్రకు ఆవాజ్ సంస్థ, సేవ్ కొత్తగూడెం సేవ్ కార్పొరేషన్ సంపూర్ణ మద్దతు ప్రకటించాయి.ఈ సందర్భంగా ఆవాజ్ పట్టణ కార్యదర్శి, సేవ్ కొత్తగూడెం సేవ్ కార్పొరేషన్ కన్వీనర్ మాట్లాడుతూ ం "దశాబ్దకాలంగా ఇక్కడ పేదలు గుడిసెలలో నివసిస్తున్నా ప్రభుత్వం ఇప్పటికీ వారి సమస్యలను పట్టించుకోవడం లేదు. వారికి స్థల హక్కు పత్రాలు జారీ చేసి, గృహనిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలి" అని డిమాండ్ చేశారు.ప్రతి పేద కుటుంబానికి ఇల్లు ఇస్తామని ప్రభుత్వాలు వరుసగా ప్రకటనలు చేస్తున్నప్పటికీ, ఆచరణలో మాత్రం అవి అమలుకావడం లేదని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఎన్నో సార్లు పోరాటాలు చేసినా పాలక వర్గాలు స్పందించడంలేదని విమర్శించారు.అత్యవసరమైన ఈ సమస్యను ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆయన గట్టిగా కోరారు.

## నీట్ పరీక్ష ఫలితాలలో ఎంబిబిఎస్ సీటు సాధించిన రంగాపురం గ్రామ విద్యార్థిని



**–గ్రామం నుండి మొట్టమొదటిసారిగా మెడిసిన్ లో సీట్ సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు..**

**పెబ్బేరు.సెప్టెంబర్ 21 (మన వార్త ప్రతినిధి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం సాయంత్రం వెల్లడించిన నీట్ పరీక్ష ఫలితాలలో పెబ్బేరు మండలం రంగాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ హనుమన్న మనుమరాలు సింగిల్ విండో డైరెక్టర్ పెద్దింటి చంద్రయ్య శారద దంపతుల కుమార్తె పెద్దింటి ఇందు ప్రభుత్వ కోటాలో మంచి ర్యాంకు సాధించి మహబూబ్ నగర్ జిల్లా మెడికల్ కాలేజీలో సీటు సాధించింది.అదేవిధంగా రంగాపురం గ్రామం నుండి విద్యార్థినీ హిందు మొట్టమొదటి సారిగా మెడిసిన్ లో ఎంబిబీఎస్ సీట్ సాధించడం పట్ల గ్రామానికి చెందిన ఇందు తాత గారైన పెద్దింటి బ్రదర్స్,తల్లితండ్రులు,గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

## బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో నమో యువ 3కే రన్



**–'గణేష్ కుండే' అధ్యక్షతన డ్రగ్స్ రహిత భరత్ లక్ష్యంగా నమో యువ కార్యక్రమం..**

**చేవెళ్ల నియోజకవర్గం సెప్టెంబర్ 21:మన వార్త ప్రతినిధి**

భారతీయ జనత పార్టీ యువ మోర్చా ఆధ్వర్యంలో తలపెట్టిన నమో యువ 3కే రన్ అట్టహాసంగా జరిగింది.యువ మోర్చా అధ్యక్షులు గణేష్ కుండే ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత భరత్ లక్ష్యంగా నమో యువ రన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది అని అన్నారు ఈ కార్యక్రమానికి చేవెళ్ల నియోజకవర్గం నుంచి వేలాదిమందిగా తరలి వెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమం లో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వశ్వర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే కే ఎస్ రత్నం,జిల్లా అధ్యక్షులు భూపాల్ గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షులు అంజన్ కుమార్ గౌడ్,మాజీ సర్పంచ్ కౌన్సిల్ మెంబెర్ ప్రభాకర్ రెడ్డి, నియోజకవర్గ మండలాల అధ్యక్షులు దారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మున్సిపల్ అధ్యక్షులు మాధాపురం శ్రీకాంత్, ఎల్గని వెంకటేష్ గౌడ్, పట్లోల ప్రభాకర్ రెడ్డి, జ్ఞానేశ్వర్, రవీందర్ రెడ్డి, లక్ష్మీపతి యాదవ్ షాపురం శ్రీకాంత్,జగపతి యాదవ్, శివ, కుండే లోకేష్, బంటు రాజ మల్లేష్,శ్రావణ్ యాదవ్, శ్రీరాంనగర్ భూత్ అధ్యక్షులు శివ గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలోదసరా ఉత్సవాలపుస్తకావిష్కరణ



**కల్వకుర్తి.సెప్టెంబర్ 21. మన వార్త ప్రతినిధి.** కల్వకుర్తి పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆదివారం దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉత్సవాల కార్యక్రమాలపై ముద్రించిన పుస్తకాన్ని వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ జూలూరు రమేష్ బాబు,ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గందె రవి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. తొలత అమ్మవారి కి పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూగత37సంవత్సరాలుగాదేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సోమవారం నుండి ఉత్సవాలకు శ్రీకారం చుడుతున్నట్లు ఆయన చెప్పారు.మొదటిరోజు అమ్మవారిని ధాన్య లక్ష్మీదేవి అలంకరణలోఅలంకరిస్తున్నామని వెల్లడించారు వేకువ జామున 5 గంటల నుండి ఉత్సవాలకు శ్రీకారంచుడుతున్నామన్నారు. ఉత్సవాల సందర్భంగా దేవాలయాన్ని విద్యుత్ దీపాల తో అలంకరించడంతోపాటు పట్టణ ముఖ్య కూడలలో మైకులను ఏర్పాటు చేసి దేవాలయంలో నిర్వహించే పూజా కార్యక్రమాలను భక్తులకు,పట్టణ వాసులకు తెలిసే విధంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని ప్రతినిత్యం ఆలయానికి విచ్చేసే భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం దాతల సహకారంతో ఏర్పాటు చేసినట్లు జూలూరు రమేష్ బాబు చెప్పారు.అక్టోబర్ 2న దసరా పండుగ, 4న అమ్మవారి ఊరేగింపు అవబృద స్నానంతో ఉత్సవాలుముగియనున్నాయిఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గంధం ప్రసాద్,పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వాస శేఖర్, మాజీ ఎంపిటిసి కల్మిచర్ల గోపాల్, ఉత్సవ కమిటీ కార్యదర్శులు గుండ్ల రేవంత్,దాచేపల్లి నితిన్, కోశాధికారులు గిరిబాబు, తరుణ్,గంప వెంకటేష్, ముత్యాలు, కిషన్, ప్రవీణ్, అప్పయ్యపల్లి శీను, సామల నరసింహ,కృష్ణయ్య,శంకర్ తదితరులతోపాటు పలువురు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్లేట్లు గ్లాసులు కుర్చీలు పంపిణీ చేసిన మాజీ వార్డు సభ్యులు



**చేగుంట సెప్టెంబర్ 21( మన వార్తా ప్రతినిధి )** చేగుంట మండలం వల్లపూర్ ప్రాథమిక పాఠశాలకు అంగన్వాడి కేంద్రాలలో విద్యార్థులకు ప్లేట్లు గ్లాసులు మరియు పిల్లలు కూర్చోవడానికి కుర్చీలను బిఆర్ఎస్ నాయకులు గ్రామ మాజీ వార్డు సభ్యులు యశోద మహేష్ కుమార్ అందజేశారు, ప్లాస్టిక్ ను నిషేధించాలని ఉద్దేశంతో విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు గ్లాసులు అందజేసినట్లు వారు తెలిపారు విద్యార్థులు క్రీడలలో నైపుణ్యం మెరుగుపరుచుకునేందుకు 25వేల రూపాయలు వెచ్చించి క్రీడా సామాగ్రి అందజేయడం జరిగిందని మాజీ వార్డు సభ్యులు యశోద మహేష్ ను తెలిపారు, పాఠశాలకు ప్లేట్లు గ్లాసులు కుర్చీలతో పాటు క్రీడా సామాగ్రిని సమకూర్చినందుకు పాఠశాల సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది, వారిని అభినందించారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీలత, పంచాయతీ కార్యదర్శి సువర్ణ, అంగన్వాడీ టీచర్ శోభ, విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై అవగాహన కల్పించిన శ్రీరంగాపూర్ ఎస్సై

**శ్రీరంగాపురం సెప్టెంబర్ 21 : (మనవార్త ప్రతినిధి)** శ్రీరంగాపురం మండల ప్రజలకు సైబర్ మోసాల గురించి,ట్రాఫిక్ ఉల్లంఘనల గురించి ఆదివారం శ్రీరంగాపూర్ మండల ఎస్సై హిమబిందు అవగాహన కల్పించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు సైబర్ మోసాల పట్ల సరైన అవగాహన కలిగి ఉండాలని,ఎవరైనా సైబర్ మోసాలకు పాల్పడితే వెంటనే తమకు తెలియజేయాలని వారు తెలిపారు.అలాగే మండల ప్రజలు పండగలకు ఊరు వెళ్ళేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని,ఇంట్లో విలువైన వస్తువులు నగదును ఉంచవద్దని,తాళం వేసిన ఇళ్లను పోలీసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉంటారని ఆమె తెలిపారు.అలాగే గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని,ప్రజలు ఎప్పటికప్పుడు పోలీసులతో స్నేహభావ సంబంధాలు కలిగి ఉండాలని వారు కోరారు.

## నిబంధనలు పాటించని మణికొండ చైతన్య కళాశాల




**– అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా సభ్యుడు చరణ్ గౌడ్..**

**మొయినాబాద్ సెప్టెంబర్ 21:మన వార్త ప్రతినిధి**

రాజేంద్రనగర్ మణికొండ లోని శ్రీ చైతన్య కళాశాల యాజమాన్యం ఆదివారం కూడా క్లాసులు నిర్వహిస్తుందని కళాశాలకు రావాలని ఒత్తిడి చేస్తున్నారని లేదంటే ప్రాక్టికల్స్ మార్కులు తగ్గిస్తామని బెదిరిస్తున్నారని విద్యార్థులకు ఒత్తిడికి గురి చేస్తున్నారని, ఆదివారం క్లాసులు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కళాశాలపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు,లేని పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సాయి కార్తీక్ శివ తదితరులు పాల్గొన్నారు.

## చేగుంటలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**చేగుంట సెప్టెంబర్ 21( మన వార్త ప్రతినిధి)**

చేగుంట మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని గ్రామాల్లో మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మతో బతుకమ్మ సంబరాలు ప్రారంభమయ్యాయి, మహాలయ అమావాస్య రోజున పూలతో బతుకమ్మలను పేర్చి మండల కేంద్రంలోని పలు ప్రాంతాలలో మహిళలు పెద్ద ఎత్తున హాజరై సాంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలాడారు, తెలంగాణ సంస్కృతి సాంప్రదాయబద్ధంగా మహిళలు చిన్న పెద్ద తారతమ్యం లేకుండా నూతన వస్త్రాలు ధరించి బతకమ్మ పాటలు పాడుతూ అటలు ఆడారు, ప్రపంచమంతా పూలతో దేవుని పూజిస్తే మనం ఈ బతుకమ్మ పండుగ రోజుల్లో పూలనే అమ్మవారుగా పూజించే సంస్కృతి మన తెలంగాణది ప్రకృతిని ఆరాధించే మహోన్నత వారసత్వానికి ప్రతీక ఈ బతుకమ్మ పండగ, నేడు మహిళలంతా బతుకమ్మ సంబరాలు పాల్గొని బతుకమ్మ ఆట ప్రారంభించగానే ఒక్కసారిగా వర్షం రావడంతో ఆడుకునే వారికే ఆటంకం కలిగింది దీంతో మహిళలు నిరుత్సాహానికి గురయ్యారు, అనంతరం బతుకమ్మలను స్థానిక హనుమాన్ దేవాలయం వద్ద ఏర్పాటుచేసిన నీటి టబ్బులో నిమజ్జనం చేశారు.

## పెద్దవేడులో బతుకమ్మ సంబరాలు



**–తెలంగాణ సంస్కృతి మరియు సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ...**

**షాబాద్ సెప్టెంబర్ 21 (మన వార్త ప్రతినిధి)**

షాబాద్ మండలంలోని పెద్దవేడు గ్రామంలో ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ సంబరాలు తెలంగాణ సంస్కృతిని పెద్ద ఎత్తున చాటేలా గ్రామ ఆడ బిడ్డలు అంత కలిసి బతుకమ్మని అలంకరించి పూజలు చేసి గ్రామ పంచాయితీ ఆవరణలో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకోవడం జరిగింది..ఈ వేడుకలో గ్రామ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నోవీస్ ప్లేవే స్కూల్ లో కోలాట నృత్యాలతో ఆడి పాడిన విద్యార్థులు ,టీచర్లు...



**కల్వకుర్తి.సెప్టెంబర్ 21 మన వార్త ప్రతినిధి.**

**–తెలంగాణ పూల పండుగ బతుకమ్మలతో నోవీస్ ప్లేవే స్కూల్ చిన్నారుల సందడి..**

కల్వకుర్తి పట్టణంలోని విద్యానగర్ కాలనీలో ఉన్న నోవీస్ ప్లేవే స్కూల్ లో స్కూల్ లో పూలను దేవతగా భావించి పూజలు అందించే ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా చేసుకున్నారు.ఈ సందర్భంగా బతుకమ్మను పలు రకాల పూలతో అందంగా పేర్చి తమ తమ ఇండ్ల నుంచి ప్రత్యేక వస్త ధారణ లతో పాఠశాలకు చేరుకొని బతుకమ్మలను ఉంచి వలయాకారం గా చప్పట్లా తాళాలతో బతుకమ్మ గేయాలతో ఉస్తావంగా పూల సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ హమీద్. డైరెక్టర్స్. రవీందర్.మహేష్. జాఫర్ మాట్లాడుతూ అనాదికాలంలో తెలంగాణ గౌరవ ప్రతిష్టలను బతుకమ్మ సంబరాలు ఇనుమడింప చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆడపడుచుల చెరువుల పండుగగా బతుకమ్మ వేడుకలను ప్రకృతి రమణీయతతో ఈ ఉత్సవాలను ఇంటింటా నిర్వహించుకునే పూల సంబరం తెలంగాణ ఖ్యాతిని దశ దిశల చాటి చెబుతున్నదని తెలిపారు ఔషధ గుణాలున్న పూలతో ఎంగిలిపూల బతుకమ్మతో మొదలుకొని సద్దుల బతుకమ్మ దాకా 9 రోజులపాటు పలు రకాల పలహారాలతో ఒకరినొకరు ఆత్మీయంగా సమైక్యంగా ఉంటూ తమ ఆనందాలను పంచుకునే ప్రత్యేక సంబరాలు బతుకమ్మ వేడుకలలో అందర్నీ ఉత్సాహంగా ఉంచుతున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుధా. కృష్ణ. కరుణాకర్. తస్లీమ్ బేగం. స్వరూప. భవాని.షిరిన్ బేగం.స్వాతి.శారద. రాధిక. అలివేలు.మాధవి. వినూత్న.ఇతర ఉపాధ్యాయిని.ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తూప్రాన్ మండలంలో ఘనంగా ప్రారంభమైన బతుకమ్మ సంబరాలు...




**తూప్రాన్ సెప్టెంబర్ 21( మన వార్త ప్రతినిధి)** తూప్రాన్ మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ బతుకమ్మ సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి, మహాలయ అమావాస్య రోజున పూలతో బతుకమ్మలను పేర్చి పలు ప్రాంతాలలో మహిళలు పెద్ద ఎత్తున సాంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలాడారు, తెలంగాణ సంస్కృతి సాంప్రదాయబద్ధంగా మహిళలు చిన్న ,పెద్ద తారతమ్యం లేకుండా నూతన వస్త్రాలు ధరించి బతకమ్మ పాటలు పాడుతూ, అటలు ఆడారు, ప్రపంచమంతా పూలతో దేవుని పూజిస్తే మనం ఈ బతుకమ్మ పండుగ రోజుల్లో పూలనే పూజించే సంస్కృతి మన తెలంగాణది ప్రకృతిని ఆరాధించే మహోన్నత వారసత్వానికి ప్రతీక ఈ బతుకమ్మ పండగ, నేడు మహిళలంతా బతుకమ్మ సంబరాలు పాల్గొని బతుకమ్మ ఆట ప్రారంభించగానే ఒక్కసారిగా వర్షం రావడంతో ఆడుకునే వారికే కొంత ఆటంకం కలిగిన వర్షంలోనే బతుకమ్మ ఆటపాటలను కొనసాగించి చెరువుల లో నిమజ్జనం చేశారు.

## మాడ్రన్ కబడ్డీ జిల్లా అధ్యక్షుడిగా ఎర్రబెల్లి సంపత్ రావు



**జమ్మికుంట, సెప్టెంబర్ 21( మన వార్త ప్రతినిధి):** మాడ్రన్ కబడ్డీ రాష్ట అధ్యక్షులు కుంబం రాంరెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం హుజూరాబాద్ లో కరీంనగర్ జిల్లా మాడ్రెన్ కబడ్డీ కార్యవర్గాన్ని రాష్ట్ర బాధ్యుడు,ఎన్నికల ఇన్చార్జి ఆరే తిరుపతి సమక్షంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఎర్రబెల్లి సంపత్ రావు,ప్రధాన కార్యదర్శిగా మావునూరి అంజయ్య, ఉపాధ్యక్షులుగా సింగిరెడ్డి తిరుపతి రెడ్డి ,ఆర్గనైజింగ్ సెక్రటరీ గా బానోతు పరశురామ్,జాయింట్ సెక్రటరీ గా బుర్ర అజయ్, కోశాధికారిగా యేముల రవి కుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తిరుపతి తెలిపారు.జిల్లా ఆధ్యకుడిగా ఎన్నికైన సంపత్ రావు మాట్లాడుతూ జిల్లాలో మాడ్రన్ కబడ్డీని విస్తరించడానికి, క్రీడాకారుల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.నూతనంగా ఎన్నికైన కమిటీకి రాష్ట్ర అధ్యక్షులు (ఫౌండర్) కుంభం రామ్ రెడ్డి మరియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతగింజల రాజారావు లు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తున్న మాజీ మిషన్ భగీరథ చైర్మన్ ఉప్పల వెంకటేష్



**కల్వకుర్తి. సెప్టెంబర్ 21 మన వార్తా ప్రతినిధి.** తలకొండపల్లి మండలం లోని పాతకోటతండా గ్రామపంచాయతీలో 1.సభావత్ బిచ్య అనారోగ్యంతోమరణించడం జరిగింది.అలాగే సభావత్ లచ్చిఅనారోగ్యంతోమరణించడం జరిగింది. తండా నాయకుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ , మాజీ రాష్ట్ర మిషన్ భగీరథ వైస్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ ప్రగడసానుభూతి తెలియచేస్తు తన ట్రస్టు నుంచి ఇద్దరికీ కలిపి 6000 రూపాయలు అందజేశారు,శ్రీ సేవాలాల్ మహారాజ్ సేవా ఫౌండేషన్ పాతకోటతండా ఆధ్వరంలో ఇద్దరికీ కలిపి 6000 రూపాయలు అందజేశారు.మొత్తం కలిపి12000 రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తండా యువ నాయకులు శ్రీను నాయక్, రమేష్ నాయక్,దస్రు నాయక్, పాండు నాయక్ , మల్లేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గుండు సూది మొన పై బతుకమ్మ : సూక్ష్మ కళాకారుడి అద్భుత ప్రతిభ



**కోదాడ, సెప్టెంబర్ 21 (మన వార్త ప్రతినిధి)** కోదాడ పట్టణానికి చెందిన సూక్ష్మ కళాకారుడు తమలపాకుల సైదులు బతుకమ్మ పండగ సందర్భంగా ఆదివారం గుండు సూది మొన పై నాలుగు మిల్లీమీటర్ల బతకమ్మను రూపొందించి తన అద్భుత కళా నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. గతంలో అనేక రకాలైన సూక్ష్మ వస్తువులపై పలువురి ప్రతిమలు చెక్కి అందరి మన్ననలు పొందారు.

## నిరుపేద కుటుంబనికి ఆర్థిక సహాయం



**వెంకటాపురం సెప్టెంబర్ 21 మనవార్త** ములుగు జిల్లా వెంకటాపురం మండలం విరభద్రవరం గ్రామంలో గత సంవత్సర కాలంగా నిరుపేద కుటుంబనికి చెందిన గత కొద్దిరోజుల క్రితం భర్త ని కొడుకు చనిపోయారు.అనాధ గా ఉండి ఆరోగ్య సమస్యలతో బాధపడుతు ఉండటానికి సరైన ఇల్లు కూడా లేక ఇబ్బందిపడుతున్న నక్కరి కృష్ణవేణి కి ఆర్థికంగా సహాయం చేయాలని విషయం తెలుసుకున్నా గ్రామంలోనీ జాతీయ బిసి సంక్షేమ సంఘం ములుగు జిల్లా ఉపాధ్యక్షులు మంచర్ల నాగేశ్వరరావు,బట్ట నాగేందర్ తమ వంతు సాయం కింద 3 వేల రూపాయలు.25 కేజీల రైస్ బ్యాగ్ అందజేసి నీరుపేద కుటుంబాలనీ ఆర్థికంగా నిలిచారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు యూత్ సభ్యులు సోలం సుధాకర్,సొలం ఓంపతి,పోడెం సురేష్,బంద రాము, గగ్గురి రమేష్,బట్ట నారాయణ, చీడెం రుశ్వేశ్వరరావు, చీడెం పుల్లయ్య,బట్ట శేఖర్,పూణెం రాజేష్, బట్ట నాగేస్,బట్ట శ్రీనివాసరావు, కొక్కురి రాజు, మంచర్ల నాగరాజు,బట్ట వెంకటేశ్వర్లు,సొలం సతీష్, పుణ్యం లక్ష్మణరావు,బంద రాములు, పొనగంటి కృష్ణారావు, పొనగంటి ప్రసాద్, బట్ట మోహన్ రావు,ఎక్కిపోయిన సాయికిరణ్,దర్రాజు గురుమూర్తి,మంచెర్ల నరేష,బట్ట పురుషోత్తం,బంద శ్రీకాంత్,కొప్పుల ప్రసాద్, మంచర్ల రమేష్,మంచర్ల జక్కులు, మాటూరి సుదర్శన్, మంచర్ల అబ్బరాజు. కుంట సందీప్,బంధ సాంబం, కుంట సంపత్,సొలం నాగేశ్వరరావు, మునిగేలా ఊర్మిళ,మంచర్ల రేవతి, మంచెర్ల వెంకటేశ్వరరావు, కుంట ఆదినారాయణ, కంటెం ఆదినారాయణ, కొంగురి శాసంత్, కంటం ప్రణయ్, లంజపల్లి చంటిబాబు,గుద్దేటి చరణ్,ఇండ్ల శివకుమార్, గద్దల ధనుంజయ్,కట్టం అభిషేక్,గుద్దేటి అరుణ్, మంచర్ల పురుషోత్తం గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని అభినందించారు.

## నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు



**ములుగు సెప్టెంబర్ 21 మనవార్త** ములుగు జిల్లా కలెక్టరేట్ లో సోమవారం 22 సెప్టెంబర్ 2025 రోజున నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 23 న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో జిల్లాస్థాయి అధికారులందరూ ఎస్ ఎస్ తాడ్వాయి మండలం లోని మేడారం లో ముఖ్య మంత్రి గారి పర్యటన ఏర్పాట్లలలో నియమించబడి క్షేత్రస్థాయిలో ఉండటం వలన ప్రజల సౌకర్యార్థం ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు.వచ్చే సోమవారం యథావిధిగా జిల్లా కలెక్టరేట్ లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో వెల్లడించారు.

## అనుమతి లేని జలపాతంలో పడి బీటెక్ విద్యార్థి మృతి



**వాజేడు సెప్టెంబర్ 21 మనవార్త** ములుగు జిల్లా వాజేడు మండలంలోని కొంగల గ్రామ సమీపంలో ఉన్న దుషపాటి లొద్ది జలపాతంలో హైదరాబాద్ కు చెందిన బీటెక్ విద్యార్థి మహాన్వెస్ నీటిలో మునిగి మృత్యువాత పడ్డాడు.ఆదివారం సెలవు దినం కావడంతో ఉదయం 6 గంటలకే స్నేహితులతో కలిసి జలపాతాన్ని సందర్శించడానికి వెళ్లారు.ఈతకొలనుకు ఆనుకొని ఉన్న ఒక ఎత్తైన బండపై నిల్సోని ఫొటోస్ దిగుతుండగా ప్రమాదశత్తు జారీ నీటిలో మునిగాడు.అది గమనించిన స్నేహితులు కాపాడడానికి ప్రయత్నించిన అది సాధ్యపడలేదు.చివరికి నీటిలో మునిగాడు.ఈ విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు,వాజేడు ఎస్సై జాలర్ల సహాయంతో సుమారు రెండు గంటలు శ్రమించి మృతుని బయటికి తీశారు. అసలైతే ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఫారెస్ట్ అధికారులు ఎవరిని లోపలికి అనుమతించరు.కాని ఇది గమనించిన కొందరు ఉదయం 6 గంటల సమయానికే జలపాతానికి సందర్శించడానికి వెళ్తున్నారు. అంతే కాకుండా ఫారెస్ట్ సిబ్బంది లోపలికి అనుమతించకున్న పంట పొలాల గుండా వెళ్లి ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు.

## కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో చిన్న బతుకమ్మ వేడుకలు




**కొండగట్టు ,సెప్టెంబర్ 21 (మన వార్త ప్రతినిధి)** జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయంలో ఎంగిలిపూల బతుకమ్మ కార్యక్రమాన్ని మహిళలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను సమర్పించి, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం పూలతో, భక్తుల సందడి తో కళకళలాడింది.సాధారణంగా చిన్న బతుకమ్మతో ప్రారంభమై, మహా బతుకమ్మతో ముగిసే ఈ పండుగలో మొదటి రోజు నుంచే భక్తులు ఉత్సాహంగా పాల్గొంటారు.

## నిరుపేదలకు ఆరుబయట బాత్రూం మరుగుదొడ్లలే నివాసాలు...



**– ఇందిరమ్మ ఇల్లు వస్తుందంటే చానా సంబురపడ్డం...**

**దేవరకద్ర,సెప్టెంబర్21(మన వార్త ప్రతినిధి)** కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటేస్తే పేద ప్రజలకు సొంతింటి కల నెరవేరుతుందని సంబురపడ్డారుకాని,ప్రభుత్వం అలసత్వం.. తీర్మాలయపల్లి గ్రామం దేవరకద్ర నియోజకవర్గానికి శాపంలా మారింది.వనపర్తి జిల్లా మదనాపురం మండలం తీర్మాలయపల్లి గ్రామానికి చెందిన వద్ల కవిత వెంకటేష్ దంపతులకు పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని ఆశల పల్లకి ఎక్కించిన నాయకులు,ఆ తర్వాత చోద్యం చూస్తున్నరు.వారికి గతంలో కావేల ఇల్లు ఉండగా శిథిలావస్థలో చేరి అది కాస్త కూలిపోయింది.ఖాళీ స్థలం ఉంటేనే ఇల్లు వస్తుందనే మాటలతో శిథిలావస్థలో ఉన్న నివాసాలను కూల్చుకొని నెలల తరబడి నిరీక్షిస్తూ,ఉండాల్సిన దుస్థితి వచ్చిందని అంటున్నారు. స్పందించి గూడు గోస తీర్చాలనే డిమాండ్ చేస్తున్నారు.కాంగ్రెస్ నాయకులు కలిసి విన్నవిస్తే.. 'ఇదిగో వస్తుంది.. అదిగో వస్తుంది' అనడం తప్ప వచ్చేది లేదు,ఇచ్చేది లేదని వాపోతున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రొసీడింగ్‌లు ఇప్పించాలని కోరుతున్నారు. కాగా,ఇందిరమ్మ కమిటీల నియామకం జరిగితేనే ఇండ్ల మంజూరు పత్రాలు లబ్ధిదారులకు అందజేసే వీలుంటుందని గృహనిర్మాణ సంస్థ అధికారులు చెబుతున్నారు.ఇందిరమ్మ ఇల్లు వస్తుందంటే చానా సంబురపడ్డం – వద్ల కవిత వెంకటేష్ఇల్లు కూల్చి ఆరుబయట బాత్రూం మరుగుదొడ్డి లో ఉంటూ వంట చేసుకుని ఎదురుచూస్తున్నాను.మా దగ్గర ఉన్న కొంత డబ్బుతో బేస్మెంటు గోడలు నిర్మించుకున్నాము. ఇప్పటివరకు బిల్లు రాలేదు. గతంలో నాకు గుండె ఆపరేషన్ అయింది.కూలి పనులు చేసుకుంటూ గ్రామాల్లో ఉంటున్న,నా భార్య ఇద్దరు కుమారులు ఉపాధి కోసం హైదరాబాదుకు వలస వెళ్లారు. మాది పేద కుటుంబం.ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నం.ఇండ్ల జాబితాలో పేరు వచ్చిందన్నరు.చాలా సంతోషమనిపించింది.ఖాళీ స్థలం చూపిస్తేనే ఇల్లు మంజూరైతదని అధికారులు అన్నరు.ఊళ్లో చాలా మంది పాత ఇంటిని తీసేస్తున్నరని తెలిసి మా ఇంటిని కూల్చుకున్నం. నెలలు గడుస్తున్న బిల్లు ఇయ్యలే.ఆరుబయట బాత్రూం మరుగుదొడ్డి ఉంటున్న.నాయకులు,సార్లు వచ్చి ఫొటోలు తీసుకొని పోవుడు తప్ప శాంక్షన్ మాత్రం అయితలేదు.

## బీసీలకు అవకాశం ఇవ్వాలి..





**కరీంనగర్,సెప్టెంబర్21( మన వార్త ప్రతినిధి):** కరీంనగర్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇంచార్జ్ బీసీలకు అవకాశం ఇవ్వాలని కరీంనగర్ లోని ఒక హోటల్ లో జరిగిన విలేకరుల సమావేశం లో బీసీ జేఏసీ నాయకులు కె శి పెద్ది శ్రీధర్ రాజు దొగ్గలి శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు అమలు దిశగా అడుగులు ముందుకు వేస్తుంది బీసీల పక్షపాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ నియోజకవర్గం అసెంబ్లీ ఇంచార్జ్ బాధ్యతలను అగ్రవర్ణాలకు కాకుండా బీసీలకే అవకాశం ఇవ్వాలని బీసీ జేఏసీ పక్షాన కోరుతున్నాం మని అన్నారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ చరిత్రలో ఈ స్థానాన్ని అగ్రవర్ణాల స్థానంగా చెప్పుకునే అగ్రవర్ణాల నాయకులు బీసీలందరు ఏకమై గత నాలుగు పర్యాయాలుగా బీసీని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటూ వస్తున్నారు. బీసీలలో చైతన్యం వచ్చి బీసీల ఓట్లు బీసీలకే వేసుకుంటున్నారు. ఇలాంటి తరుణంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ బాధ్యతలను కాంగ్రెస్ పార్టీ బీసీలకే కేటాయించాలని కోరారు .కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం జరిగిన ఎన్నికలలో బీసీ కే టికెట్ కేటాయించడం జరిగిందని గుర్తు చేశారు. అలాగే నియోజకవర్గ ఇన్చార్జిగా పురమళ్ళ శ్రీనివాస్ కు ఇవ్వడం జరిగింది కానీ ఇతర కారణాలవల్ల పార్టీ నుండి సస్పెండ్ చేయడం జరిగింది, బీసీ పక్షపాతి అయిన పురమల్ల శ్రీనివాస్ కు తిరిగి అవకాశం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేశి పెద్ది శ్రీధర్ రాజు ,దొగ్గలి శ్రీధర్, మియాపురం రవీంద్ర చారి, గుమ్మడి శ్రీనివాస్ , తాడూరి కృష్ణ , వాయిల రాజ్ కుమార్,తాడూరి రవిచందర్ , కరుణాకర్,కట్ట సంజిత్ మరియు బీసీ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## గుడిలో జమ్మి చెట్టు..

**జమ్మికుంట, సెప్టెంబర్ 21( మన వార్త ప్రతినిధి):** ఊరు ఊరికో జమ్మి చెట్టు,గుడి గుడికో జమ్మి చెట్టు.. కార్యక్రమం లో భాగంగా జమ్మికుంటలోని ఆంజనేయ దేవస్థాన ఆవరణలో మున్సిపాలిటీ మాజీ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వర్ రావు, మాజి తాజా కౌన్సిలర్లు ములుగు దిలీప్ ,గాజుల భాస్కర్ తో కలిసి అర్చకులు హరి మంత్రోచ్చారణ తో జమ్మి మొక్కను నాటారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రావు, దిలీప్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వృక్షం జమ్మిని ప్రతీ ఊరిలో, ప్రతీ గుడిలో నెలకొల్పాలనే ఉద్దేశ్యంతో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమని అన్నారు. పుట్ట మధు మూడు సంవత్సరాల ముందు నాటిన జమ్మి మొక్కను అందరికి చూపించి అందరికి వివరించారు.వేదకాలం నుంచి అత్యంత ప్రతిష్ట కలిగిన చెట్టుగా, భక్తి పూర్వకంగా అందరూ పూజించుకునే జమ్మి చెట్లును తెలంగాణ రాష్ట్ర వృక్షంగా ప్రభుత్వం గుర్తించింది. అయితే అనేక కారణాలతో అంతరించిపోతున్న జమ్మి చెట్లను దాని విశిష్టత రీత్యా ప్రతీ ఊరిలో, ప్రతీ గుడిలో ఉండేలా, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ తరపున ఊరు ఊరుకో జమ్మి చెట్టు గుడి గుడికో జమ్మి చెట్టు అనే నినాదాన్ని జోగినపల్లి సంతోష్ కుమార్ తీసుకున్నందుకు అందరి పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో హరితసేన రాష్ట్ర కోర్డినేటర్ గర్రెపల్లి సతీష్, చెప్యాల రాజేశ్వర్ రావు, ప్రేమ్, మనోజ్, చింటు, శ్రీకాంత్, మణిదీప్, మనోజ్ స్థానిక బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యానగర్ కాలనీలో బతుకమ్మ పండుగ



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చుంచుపల్లి మండలం, సెప్టెంబర్ 22 (మన వార్త ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మను విద్యానగర్ కాలనీ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నా పెద్దా అందరూ సంప్రదాయ వేషధారణలో పాల్గొని పూలతో చేసిన బతుకమ్మలను అందంగా అలంకరించారు. పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకున్నారు.కాలనీవాసులందరూ ఏకతాటిపై కలసికట్టుగా సంబరాలు జరుపుకోవడం విశేషం. విద్యానగర్ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి పండుగను మరింత వైభవంగా మార్చారు. సాయంత్రం సమయానికి మహిళలు బతుకమ్మ చుట్టూ వలయం కట్టి పాటలు పాడి, నృత్యాలు చేస్తూ వాతావరణాన్ని ఉత్సాహభరితంగా మార్చారు.ఈ సందర్భంగా కాలనీ పెద్దలు మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల ప్రతిబింబమని, తరతరాలకు వారసత్వంగా అందించాల్సిన ఆచారమని పేర్కొన్నారు.

## ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు...



**జమ్మికుంట, సెప్టెంబర్ 21( మన వార్త ప్రతినిధి):** పూలతో పూజించే పువ్వులకు పూజించే రోజు వేడుక ప్రారంభమైంది.పండుగ,పూజ ఏదైనా కార్యక్రమానికి పువ్వులను వాడుతారు. కాని పువ్వులను పూజించే పండగ బతుకమ్మ పండుగ.బతుకమ్మ పండుగకు మహిళలు తీరొక్క పువ్వులతో బతుకమ్మను పేర్చి ఆట పాటలతో సందడి చేస్తారు. పెత్రమాసతో ఎంగిలి పూల బతుకమ్మ ప్రారంభించి తొమ్మిదిరోజులు చిన్నా, పెద్దా మహిళకు,యువతులు భక్తి శ్రద్ధలతో బతుకమ్మ ఆడుతారు.ఆదివారం ఎంగిలి పూల బతుకమ్మ జమ్మికుంట మండలం,పట్టణ వ్యాప్తంగా బతుకమ్మ ఆడారు.ఎంగిలి బతుకమ్మ వేడుకలను పట్టణ సీఐ రామకృష్ణ,మున్సిపాలిటీ మేనేజర్ రాజిరెడ్డి ప్రారంభించారు.

## సీసీ కెమెరాల దాత గొరిగే నరసింహకు కృతజ్ఞతలు



**-సీసీ కెమెరాలు ప్రారంభించిన మేడిపల్లి సీఐ గోవింద్ రెడ్డి..**
**-ముఖ్య అతిథిలుగా పాల్గొన్న పలువురు సీనియర్ నాయకులు..**
**తెలంగాణస్టేట్ బ్యూరో, భాస్కర్ చారి, సెప్టెంబర్ 21, మనవార్త.**

ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం,కెమరా అబద్ధం ఆడదు,దానికి కుల, మత ప్రాంతీయ బేధాలు లేకుండా నిజాలే చెప్తుంది, రెప్పవాల్చకుండా పనిచేస్తుందని మేడిపల్లి సిఐ గోవింద్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చిన్న క్రాంతి కాలనీలో దాత గొరిగే రాధిక నరసింహ కురుమ సహకారంతో సీసీ కెమెరాలు ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్, కాంగ్రెస్ నాయకులు, చిన్న క్రాంతి కాలనీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కాలనీలో కెమెరాలు అమర్చుకోవడానికి ముందుకు రావాలని కోరారు. ఈ కెమెరాలకు ఆర్థిక సహాయం అందించిన దాత గొరిగె నరసింహకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎవరో వస్తారు ఏదో చేస్తారని ఎదురు చూడకుండా తమ కాలనీ, తమ పరిసర ప్రాంతాల భద్రత కొరకు ఈ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ నాయకులు, చెంగిచెర్ల గ్రామ పెద్దలు,పలు కాలని వాసులు, అధిక సంఖ్యలో చిన్నక్రాంతి కాలనీ వాసులు, మహిళలు పాల్గొని సీసీ కెమెరాల ప్రారంభోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నాగర్ కర్నూల్ గుడిపల్లి లో నకిలీ యూరియా దందా..!

-ఒక్కో యూరియా బస్తాకి 500 నుంచి 600 వరకు అమ్మకం...
-నకిలీ దందాపై అధికారుల చర్యలు శూన్యం...



**తెలంగాణస్టేట్ బ్యూరో, భాస్కర్ చారి, సెప్టెంబర్ 21, మనవార్త**

నాగర్ కర్నూలు జిల్లా గుడిపల్లి గ్రామంలో ఉన్నటువంటి అడిషనల్ ఆగ్రో రైతు సేవా కేంద్రం(సబ్సిడీ కేంద్రం) నడుపుతున్న హనుమంత రెడ్డి అనే వ్యక్తి నకిలీ మందులు అమ్మడమే కాకుండా నకిలీ యూరియా కూడా విక్రయిస్తున్నాడని పలువురు రైతులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే యూరియా 25 శాతం మాత్రమే ఉంటుందని మిగతా 75 శాతం కర్ణాటక నుండి నకిలీ యూరియా విక్రయించి ఇక్కడి రైతులకు 500 నుంచి 600 వరకు బ్లాక్ లో అమ్ముతూ రైతులను మోసగిస్తున్నాడని వాపోయారు. ఈ తతంగం అంతా అధికారులకు తెలిసి కూడా మాకేం పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే యూరియా బస్తాలను సబ్సిడీ కేంద్రాలలో మాత్రమే విక్రయించాలి. కానీ ఈ హనుమంత రెడ్డి అనే వ్యక్తి పెద్దాపూర్ గ్రామంలో తన ఇంటి వద్ద రెండు గోదాములను ఏర్పాటు చేసుకొని అక్కడినుండి నకిలీ యూరియా దందా కొనసాగిస్తున్నాడు. ఇదంతా తెలిసిన సంబంధిత అధికారులు ఇతనిపై చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంపై పలువురిలో అనుమానం వ్యక్తం అవుతుంది. అసలే యూరియా కొరత ఉన్న సమయంలో ఒక్కో బస్తా మీద 500 నుంచి 600 రూపాయలు ముక్కు పిండి వసూలు చేస్తున్నాడు అంటూ స్థానిక రైతులు ఆగ్రహిస్తున్నారు. వడ్లు, పత్తి కొనుగోలు చేసే కాంటలో కూడా కిలో నుంచి రెండు కిలోల మధ్యలో రిమోట్ తో సెట్టింగ్ చేస్తున్నాడని, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## శివాలయంలో మహిళల ఆటపాటలతో ఘనంగా ఎంగిలి బతుకమ్మ పండుగ




**జమ్మికుంట, సెప్టెంబర్ 22 (మన వార్త ప్రతినిధి):**జమ్మికుంట శివాలయం లో ఎంగిలి పండుగ బతుకమ్మ పండుగను మహిళలు ఆటపాటలతో ఘనంగా జరుపుకున్నారు. చిన్నా పెద్దా అందరూ సంప్రదాయ వేషధారణలో పాల్గొని పూలతో చేసిన బతుకమ్మలను అందంగా అలంకరించారు. పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకున్నారు. ముఖ్యంగా సాయంత్రం సమయానికి మహిళలు బతుకమ్మ చుట్టూ వలయం కట్టి పాటలు పాడి, నృత్యాలు చేస్తూ వాతావరణాన్ని ఉత్సాహభరితంగా మార్చారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల ప్రతిబింబమని, తరతరాలకు వారసత్వంగా అందించాల్సిన ఆచారమని పేర్కొన్నారు.

## బిర్యానీ తింటూ..
## కూల్ డ్రింక్ తాగుతున్నారా!




ప్రస్తుత కాలంలో... ఆరోగ్యం పట్ల ఖచ్చితంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆరోగ్యం విషయంలో కాస్త లైట్ తీసుకున్నా.. పెను ప్రమాదంలో పడ్డట్టే.మనం సంపాదించే డబ్బులకంటే.. ఆరోగ్యమే ప్రస్తుత కాలంలో చాలా ముఖ్యం. ఎలాంటి చెడు అలవాట్లు లేని వారికి కూడా.. భయంకరమైన వ్యాధులు ఈ మధ్యకాలంలో వస్తున్నాయి. మరి ఈ నేపథ్యంలో బిర్యాని తింటూ కూల్ డ్రింక్ తాగే వారు కాస్త జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు వైద్య నిపుణులు.చాలా మంది బిర్యాని సెంటర్లకు వెళ్లి... కచ్చితంగా కూల్ డ్రింక్ తాగేస్తున్నారు. దాన్ని అలవాటుగా మార్చుకుని ఎంజాయ్ చేస్తున్నారు. అయితే అలా చేస్తే కొన్ని అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్య నిపుణులు సూచనలు చేస్తున్నారు. ఒకవేళ బిర్యానీ తింటూ ఫుల్ డ్రింక్ తాగితే.. తిన్న ఆహారం ఏమాత్రం జీర్ణం కాదని అంటున్నారు. భవిష్యత్తులో అజీర్ణ సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉందని చెబుతున్నారు. కూల్ డ్రింక్స్ వల్ల జరిగే కార్బోనేషన్.. జీర్ణ క్రియను దెబ్బతీస్తుందని స్పష్టం చేస్తున్నారు వైద్యనిపుణులు. జీర్ణ వ్యవస్థ దెబ్బ తింటే కచ్చితంగా గ్యాస్ ట్రబుల్, మలబద్ధక సమస్యలు కూడా వస్తాయి అంటున్నారు. ఇలా కూల్ డ్రింక్ తాగితే బరువు కూడా పెరిగే ప్రమాదం ఉందని చెబుతున్నారు. మరి బిర్యానీ తింటూ... కూల్ డ్రింక్ తాగే బదులు కాస్త మజ్జిగ తాగితే బెటర్ అని అంటున్నారు. మజ్జిగ తాగితే... తిన్న ఆహారం వెంటనే జీర్ణం అవుతుందని చెబుతున్నారు. మజ్జిగ లేకపోతే... పెరుగు కూడా ట్రై చేయవచ్చని అంటున్నారు.

## ప్రాణాంతకంగా మారిన అమీబా



అదో సూక్ష్మజీవి. కంటికి కనిపించదు. చెవికి వినిపించదు. అసలు దాని ఉనికే మనిషికి తెలియదు. కానీ మనకు తెలియకుండానే మన శరీరంలోకి దూరి, మన మెదడులోకి ప్రవేశించి..కొంచెం కొంచెంగా మన బ్రెయిన్‌ను తినేస్తుంది. కొన్నిరోజుల్లోనే మనల్ని చంపేస్తుంది. అదో సూక్ష్మజీవి. కంటికి కనిపించదు. చెవికి వినిపించదు. అసలు దాని ఉనికే మనిషికి తెలియదు. కానీ మనకు తెలియకుండానే మన శరీరంలోకి దూరి, మన మెదడులోకి ప్రవేశించి..కొంచెం కొంచెంగా మన బ్రెయిన్‌ను తినేస్తుంది. కొన్నిరోజుల్లోనే మనల్ని చంపేస్తుంది. అంతటి డేంజర్ క్రిమి..ఇప్పుడు మన దేశాన్ని భయపెడుతోంది. అదే అమీబా. ఇప్పుడది కేరళను వణికిస్తోంది. మెదడును తినే పరాన్నజీవి అమీబా ఇన్ఫెక్షన్ అయిన అమీబిక్ మెనింగోఎన్సెఫాలిటిస్ అరుదైన వ్యాధి. మూడు నెలల శిశువు నుంచి 52 ఏళ్ల వ్యక్తి దాకా ఇలా 70 మంది ప్రాణాలను బలిగొంది. ఆగస్టు నెల కోజికోడ్ జిల్లాకు చెందిన ఓ బాలిక చికిత్స పొందుతూ చనిపోయింది. బ్రెయిన్? ఈటింగ్ అమీబాతోనే బాలిక చనిపోయిందని వైద్యులు నిర్ధారించారు.

## పిల్లలతో మొబైల్ వాడకం తగ్గించే టిప్స్



ఇప్పుడు మన రోజువారీ జీవితం పూర్తిగా మారిపోయింది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి వయసులో మొబైల్ ఫోన్లను ఉపయోగిస్తున్నారు. మొబైల్ ఫోన్లు ఒక వైపు సౌకర్యం, వినోదం, విద్యా సాధనంగా మారినప్పటికీ, చిన్న వయసులో పిల్లలు ఎక్కువ సేపు వాటిని ఉపయోగించడం పెద్ద సమస్యలకు కారణం అవుతోంది. నిద్రలో అంతరాయం, కళ్ళు బలహీనపడటం, దృష్టి సమస్యలు, శారీరక వ్యాయామం లోపం, సామాజిక పరస్పర సంబంధాలు తగ్గడం వంటి సమస్యలు పిల్లలపై నేరుగా ప్రభావం చూపుతున్నాయి. తల్లిదండ్రులు, పెంపకంలో భాగంగా పిల్లల డిజిటల్ వినియోగాన్ని సమతుల్యం చేయడం ఎంతో అవసరం. కానీ ఇది సులభం కాదు, ఎందుకంటే పిల్లలు మొబైల్ ఫోన్ లో గేమ్స్, యూట్యూబ్ వీడియోలు, సోషల్ మీడియా వంటి విషయాలతో వెంటనే ఆకర్షితులు అవుతారు. ఇలాంటి సందర్భాల్లో, సరైన మార్గదర్శకత, క్రమమైన షెడ్యూలింగ్, సరైన ప్రేరణ వంటివి తీసుకుంటే పిల్లలు మొబైల్ వాడకాన్ని తగ్గించడంలో సక్సెస్ సాధించవచ్చు. 1. ఆటలతో ఆకట్టుకోండి: పిల్లలు సహజంగా ఎగురుతూ, కదులుతూ, ఆటలలో నిమగ్నమవడం ఇష్టపడతారు. కాబట్టి మొబైల్ ఫోన్లను వదిలిపెట్టి, వారిని క్రికెట్, ఫుట్‌బాల్, సైక్లింగ్, వాలీబాల్ వంటి ఆటలలో పాల్గొనమని ప్రోత్సాహించండి. ఆటలు కేవలం వినోదం మాత్రమే కాదు, పిల్లల శారీరక దృఢత్వం, దృష్టి సామర్థ్యం, సమన్వయ కౌశల్యం ను కూడా పెంపొందిస్తాయి. పిల్లలని ఆటల్లో పాల్గొనమని ప్రోత్సహించడం ద్వారా, వారి మనసు మొబైల్ నుండి దూరమవుతుంది. ఉదాహరణకు, రోజు స్కూల్ తర్వాత 30–45 నిమిషాలు సైక్లింగ్ లేదా ఇంటి ప్రాంగణంలో బాస్కెట్‌బాల్ ఆడటానికి ప్రోత్సహిస్తే, వారి శారీరక వ్యాయామం కూడా పూర్తవుతుంది మరియు ఆరోగ్యకరమైన అలవాట్లు ఏర్పడతాయి.ఇలా చిన్న వయసులోనే ఆరోగ్యకరమైన, క్రియాశీలమైన జీవనశైలి కు వారిని అలవర్చించడం, వృద్ధాప్యం వరకు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మేలు చేస్తుంది. 2. పరిష్కార ఆధారిత రివార్డ్స్: పిల్లలు మొబైల్ వాడకం కోసం సహజంగా ఎక్కువ ఉత్సాహం చూపుతారు. కాబట్టి మొబైల్‌ను ఒక రివార్డ్ గా మార్చడం చాలా ప్రభావవంతమైన పద్ధతి. ఉదాహరణకు, హోంవర్క్, పాఠాలు, లేదా ఏదైనా బాధ్యతా పనిని పూర్తిగా చేసిన తర్వాతే మొబైల్ వాడడానికి అనుమతించండి. ఇది పిల్లలకు ప్రతిదానికి ఒక ప్రతిఫలాన్ని పొందడం అనే భావనను నేర్పిస్తుంది. అలా చేస్తే, మొబైల్ ఉపయోగం అలవాటుగా కాకుండా, ఒక ప్రోత్సాహకం గా మారుతుంది. పిల్లలు పని పూర్తి చేయడంలో ఉత్సాహం చూపిస్తారు, సమయపాలన మరియు దయార్ధత కూడా పెరుగుతుంది. అలాగే, ఈ విధానం వల్ల వెర్సెస్ వ్యసనపు ఉపయోగం తగ్గుతుంది. కేవలం సరదాగా లేదా అనవసరంగా ఫోన్లో గడపడం కాకుండా, మొబైల్ ఉపయోగం ఒక సాధనమని భావిస్తారు. ఈ సరళమైన నియమాన్ని పిల్లల వయసుకు అనుగుణంగా అమలు చేస్తే, వారి ఆత్మ నిబంధన అభివృద్ధి అవుతుంది. 3. కుటుంబతో సమయం: పిల్లల మొబైల్ వాడకాన్ని తగ్గించడంలో కుటుంబంతో సమయం గడపడం అత్యంత ప్రభావవంతమైన మార్గం. ప్రతి రోజు కొంత సమయాన్ని పిల్లలతో ఆటలు ఆడడం, నేరుగా మాట్లాడటం, లేదా సృజనాత్మక యాక్టివిటీల్లో పాల్గొనడం కోసం వెచ్చించండి. ఈ విధంగా, పిల్లలు మొబైల్‌కు బదులుగా కుటుంబంతో గడిపే సమయాన్ని ఆస్వాదించగలరు. ఇది వారి సామాజిక మరియు భావోద్వేగపరమైన అభివృద్ధికి కూడా సహాయపడుతుంది. చిన్నవయసులోనే, తల్లిదండ్రుల తో నేరుగా ఇంటరాక్షన్ అనుభవించడం వల్ల, పిల్లలలో మానసిక సంతులనం, కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయి. అలాగే, ఈ సమయాలు పిల్లల దృష్టిని ఫోన్ నుండి దూరంగా మార్చడంలో సహాయపడతాయి. అంటే, మొబైల్ వాడకాన్ని అవసరమైన సందర్భాలకు పరిమితం చేయడం సులభం అవుతుంది. చిన్న చిన్న ఆటలు, వర్క్‌షాప్‌లు, లేదా కవితా, కథల సమయం ఇవి అందరికి ఒక పాజిటివ్ అలవాటు గా మారతాయి. 4. ఫోన్ల నష్టాల గురించి అవగాహన: మొబైల్ ఎక్కువ సమయం ఉపయోగించడం వల్ల కళ్ళు బలహీనపడడం, నిద్ర లోపం, మెదడు కార్యకలాపాలపై ప్రభావం వంటి సమస్యలు తలెత్తగలవు. తల్లిదండ్రులు ఈ ప్రతికూల పరిణామాలను పిల్లలకు సరళమైన, అర్థమయ్యే విధంగా వివరించాలి. ఉదాహరణకు: ఎక్కువ స్క్రీన్ టైమ్ కళ్ళపై ఒత్తిడి పెంచి దృష్టి సమస్యలు తేవొచ్చు. ఫోన్ల వాడకం వల్ల తగిన విశ్రాంతి లేమి ఏర్పడుతుంది, ఇది ఆరోగ్యానికి హానికరంగా ఉంటుంది. ముఖ్యంగా మెదడుపై ప్రభావం వల్ల సృజనాత్మకత, సమస్య పరిష్కార సామర్థ్యం తగ్గే అవకాశం ఉంటుంది. కనుక పిల్లలు ఈ కారణాలను అర్థం చేసుకుంటే, మొబైల్ వాడకాన్ని స్వయంగా నియంత్రించేందుకు ప్రేరణ పొందుతారు.

# బాదంతో మెదడుకు పదును..



బాదం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఈ సూపర్ ఫుడ్ మన మెదడుకు పదును పెట్టడమే కాకుండా మన చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. చిన్నప్పుడు మన అమ్మమ్మలు, అమ్మలు రోజూ ఉదయాన్నే నానబెట్టిన బాదంపప్పులు తినమని బలవంతం చేసేవారు. ఇవి తింటే చదువు బాగా వస్తుంది, అన్నీ గుర్తుంటాయి అని చెప్పేవారు. ఇవి కేవలం మాటలే కాదు. మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేసేవి. అవును.. బాదంపప్పులు మన ఆరోగ్యానికి చాలా మంచివి. వాటిలో ప్రోటీన్లు, విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వాటిని నానబెట్టి తింటే ప్రయోజనాలు రెట్టింపు అవుతాయి. బాదంలో విటమిన్ ఇ, మెగ్నీషియం, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఇవన్నీ మన మెదడుకు చాలా అవసరం. రోజూ 4–5 నానబెట్టిన బాదంపప్పులు తింటే జ్ఞాపకశక్తి పెరుగుతుంది. చదువుకునే వారికి ఇది చాలా ఉపయోగపడుతుంది. బాదంపప్పులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. నానబెట్టిన బాదంలో ఉండే ఎంజైమ్‌లు ఆహారం త్వరగా జీర్ణమయ్యేలా చేస్తాయి. దీనివల్ల మలబద్ధకం, గ్యాస్ వంటి సమస్యలు తగ్గుతాయి. బరువు తగ్గాలనుకునేవారికి నానబెట్టిన బాదంపప్పులు ఒక అద్భుతమైన ఆహారం. ఇందులో ఉండే ఫైబర్ కారణంగా ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్నట్లు అనిపిస్తుంది, దాంతో అతిగా తినడం తగ్గుతుంది. అంతేకాకుండా ఇది మన జీవక్రియను వేగవంతం చేస్తుంది. ఇది బరువు తగ్గడంలో సహాయపడుతుంది. నానబెట్టిన బాదంపప్పులు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మన రోగనిరోధక శక్తి పెరుగుతుంది. బాదంలో ఉండే ఖనిజాలు, విటమిన్లు మన శరీరాన్ని వైరల్ వ్యాధుల నుంచి కాపాడతాయి. మీరు రోజంతా అలసిపోయినట్లు, నీరసంగా ఉన్నట్లయితే ఉదయం పూట నానబెట్టిన బాదం తినడం మంచిది. ఇందులో ఉండే పోషకాలు రోజంతా మిమ్మల్ని శక్తివంతంగా ఉంచుతాయి. బాదంపప్పులో ఉండే యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ ఇ చర్మంపై ముడతలు, సన్నని గీతలను తగ్గిస్తాయి. దీనివల్ల చర్మం సహజంగా మెరుస్తుంది. అలాగే ఇందులో ఉండే ఒమేగా–3 కొవ్వు ఆమ్లాలు, మెగ్నీషియం జుట్టును పొడవుగా, బలంగా, మరియు నల్లగా పెంచడంలో సహాయపడతాయి. నానబెట్టిన బాదంపప్పులు తినడం వల్ల జుట్టు మెరిసేలా ఉంటుంది.

# మటన్ ఎక్కువగా తింటున్నారా!




ఎర్ర మాంసం పోషకాలతో సమృద్ధిగా ఉన్నప్పటికీ దానిని అధికంగా తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం. ముఖ్యంగా ప్రాసెస్ చేసిన మాంసాలు ఆరోగ్య సమస్యలు తెస్తాయి. ఇటీవలి పరిశోధనలు ఇది గుండె జబ్బులు, టైప్ 2 డయాబెటిస్, క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుందని హెచ్చరించాయి. మటన్ అంటే చాలామందికి ఇష్టమైన ఆహారం. దాని రుచి, పోషకాల కారణంగా దీనిని ఎక్కువగా తింటుంటారు. కానీ ఎర్ర మాంసాన్ని దానిని అతిగా తీసుకుంటే తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల జరిగిన కొన్ని పరిశోధనలు ఈ విషయంలో మరింత ఆందోళన కలిగించే విషయాలను వెల్లడించాయి. గొడ్డు మాంసం, దూడ మాంసం, పంది మాంసం, గొర్రె, మేక మాంసం వంటి జంతువుల నుండి వచ్చే మాంసాన్ని ఎర్ర మాంసం అంటారు. దీనికి ఎరుపు రంగు రావడానికి కారణం మయోగ్లోబిన్ అనే ప్రోటీన్. ఎర్ర మాంసంలో విటమిన్ బి12, ఐరన్, జింక్, బి–విటమిన్లు వంటి ఎన్నో ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. ఇది శరీరానికి సులభంగా లభించే అధిక–నాణ్యత ప్రోటీన్‌కు కూడా మంచి మూలం. సుమారు 28 గ్రాములు మాంసంలో 7 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. అందుకే ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా దీనిని అప్పుడప్పుడు తీసుకోవడం మంచిది. పోషకాలు ఉన్నప్పటికీ ఎర్ర మాంసాన్ని వారానికి ఒకసారి మాత్రమే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ప్రాసెస్ చేసిన మాంసాలైన హామ్, బేకన్, సలామీ వంటి వాటిలో సంతృప్త కొవ్వులు, సోడియం ఎక్కువగా ఉంటాయి. ఇవి గుండె జబ్బులు, టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని పెంచుతాయి. గుండె జబ్బులు: ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం పరిశోధన ప్రకారం.. రోజుకు 50 గ్రాముల ప్రాసెస్ చేసిన ఎర్ర మాంసం తినేవారిలో గుండె జబ్బుల ప్రమాదం 18 శాతం పెరుగుతుంది. డయాబెటిస్: ది లాన్సెట్ డయాబెటిస్ అండ్ ఎండోక్రినాలజీ పత్రికలో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం.. రోజుకు రెండు ముక్కల హామ్ వంటి ప్రాసెస్ చేసిన మాంసం తినడం వల్ల టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం 15 శాతం పెరుగుతుంది. కొలెస్ట్రాల్: ఎర్ర మాంసం శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిని పెంచుతుంది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని మరింత పెంచుతుంది. క్యాన్సర్: ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎర్ర మాంసాన్ని గ్రూప్ 2ఎ క్యాన్సర్ కారకంగా వర్గీకరించింది. ముఖ్యంగా ప్రాసెస్ చేసిన ఎర్ర మాంసం, కొలొరెక్టల్ క్యాన్సర్ వంటి కొన్ని రకాల క్యాన్సర్‌లతో ముడిపడి ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఎర్ర మాంసం పోషకాలను అందిస్తున్నప్పటికీ దానిని మితంగా మాత్రమే తీసుకోవడం మంచిది. ప్రాసెస్ చేసిన మాంసాలను వీలైనంత వరకు దూరం పెట్టాలి. ఆరోగ్యకరమైన జీవితం కోసం సమతుల్య ఆహారం తీసుకోవడం, తాజా మాంసాన్ని ఎంచుకోవడం, శారీరక శ్రమ చేయడం అవసరం.

# ఉల్లిపాయలను తింటే క్యాన్సర్ తప్పదా?



ఉల్లిపాయ.. ఇది లేనిదే ఇంట్లో వంటచేయడమే కుదరదు. ఎందుకంటే ఉల్లిపాయను ప్రతిరోజూ ఒకటి కంటే ఎక్కువ ఆహార పదార్థాలలో ఉపయోస్తాం. చాలా ఇళ్లలో గృహిణులు ఉల్లిపాయలు లేవంటే వంటచేయడమే మానేస్తారు. అలా ఉంటుంది వాటి క్రేజ్. కానీ ఈ ఉల్లిపాయల్లో కొన్నింటిని తినడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా ప్రతిరోజూ ఏదో ఒక ఆహారంలో మనం ఉల్లిపాయను ఉపయోగిస్తాం. ఇవి లేకుండా కూరగాయాలు చేస్తే అసలు టేస్టే ఉండదు. చాలా ఇళ్లలో, గృహిణులు ఉల్లిపాయలు లేకుండా వంట చేయమంటే అస్సలూ కుదరదని మొహం మీదే చెప్పేస్తారు. అలా ఉంటుంది వీటి క్రేజ్ మరీ. అయితే కొన్ని సార్లు ఉల్లిపాయలపై నల్ల మచ్చలు రావడం, లేదా బూజు పట్టడం జరుగుతుంది. అలాంటి వాటిని తినడం ఆరోగ్యానికి చాలా హానికరమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అవును మీరు విన్నది నిజమే వీటిని తినడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు వస్తాయో తెలిస్తే.. అలాంటి వాటిని తినడం మీరు ఇప్పుడే మానేస్తారు. పోషకాహార నిపుణుల ప్రకారం.. కొందరు ఉల్లిపాయలో దెబ్బతిన్న భాగాన్ని, అంటే నల్ల మచ్చలు ఉన్న ప్రాంతాన్ని తొలగించి, మిగిలిన భాగాన్ని మాత్రమే ఉపయోగిస్తారు. కానీ ఇలా చేయడం చాలా పెద్ద తప్పు. ఈ రకమైన బూజు ఎక్కువగా ఉల్లిపాయ లోపలి భాగంలో మాత్రమే కనిపిస్తుంది. దీనిని గుర్తించడం చాలా కష్టం అని వారు చెప్తున్నారు. పోషకాహార నిపుణురాలు ప్రకారం, నల్ల మచ్చలు లేదా బూజు ఉన్న ఉల్లిపాయలను ఎప్పుడూ ఉపయోగించకూడదు. ఇవి మైకోటాక్సిన్ అనే రకమైన టాక్సిన్‌ను ఉత్పత్తి చేస్తాయి, ఇది మానవ శరీరంపై ప్రతికూల ప్రభావాలను చూపుతుంది. అటువంటి ఉల్లిపాయలను తినడం వల్ల ఆహార అలెర్జీలు, వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి వంటి సమస్యలు వస్తాయి. అవే కాకుండా వాటి వల్ల క్యాన్సర్, కాలేయ క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులు కూడా వచ్చే అవకాశం ఉందని ఆమె చెబుతున్నారు. కాబట్టి వాటిని శుభ్రంచేసి వినియోగించడం కన్నా.. పడేయడం బెస్ట్ అని నిపుణులు చెబుతున్నారు. మనం ఇలాంటి సమస్యల నుంచి దూరంగా ఉండాలనుకుంటే ఎప్పుడూ ఫ్రెష్‌గా ఉండే ఉల్లిపాయలు వినియోగించాలి. అవి టైప్ 2 డయాబెటిస్‌కు ప్రయోజనకరంగా ఉంటాయి. అలాగే రక్తపోటును నియంత్రించడంలోనూ సహాయపడతాయి. వేసవి ఎండలో బయటకు వెళ్ళే ముందు ఉల్లిపాయలు తినడం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది. అలాగే హీట్ స్ట్రోక్ ఉపశమనం లభిస్తుంది. ఎందుకంటే ఇది శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఉల్లిపాయలపై నల్ల మచ్చలు లేదా బూజు రాకుండా ఉండటానికి వాటిని సరిగ్గా నిల్వ చేయడం చాలా ముఖ్యం. చాలా మంది మళ్లీ మళ్లీ ఎవరు కొంటారని.. ఒకేసారి బల్క్‌లో కొని ఇంట్లో పెట్టుకుంటారు. ఇలా ఒకే దగ్గర ఎక్కువ మొత్తంలో నిల్వ చేయడం ద్వారా నల్ల మచ్చలు, బూజూ వచ్చే ప్రమాదం ఉంది. కాబట్టి మీకు అవసరమైన ఉల్లిపాలయను అప్పుడే తెచ్చుకొండి. అలాగే మీరు తెచ్చిన ఉల్లిపాయల్ని చల్లని, తేమగా ఉండే ప్రదేశాల్లో ఉంచకండి.

# అరటిని ఈ ఒక్కటి కలిపి తినండి..



శరీరానికి బలాన్నిచ్చే అరటిపండు, సుగంధ ద్రవ్యాల రాణి నల్ల మిరియాలు. ఈ రెండింటిని కలిపి తింటే ఏం జరుగుతుందో తెలుసా? చాలామంది రోజుకో అరటిపండు తినడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి మాత్రమే ఆలోచిస్తారు. కానీ దానిపై కొద్దిగా నల్ల మిరియాల పొడి చల్లి తింటే అద్భుతమైన ఆరోగ్య లాభాలుంటాయి. ఈ కలయిక మీ ఆరోగ్యాన్ని ఎలా మెరుగుపరుస్తుందో నిపుణుల మాటల్లో తెలుసుకుందాం. మన వంటింట్లో లభించే కూరగాయలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలు పోషకాల నిధి. వాటిని సరైన విధంగా, సరైన సమయంలో తింటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. అరటిపండు, నల్ల మిరియాలు రెండూ శరీరానికి చాలా ఉపయోగకరమైనవి. అరటిపండు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, శరీరాన్ని బలపరుస్తుంది. నల్ల మిరియాలు ఆయుర్వేదంలో ఔషధంలా భావిస్తారు. రోజూ ఒక అరటిపండును నల్ల మిరియాల పొడితో కలిపి తింటే ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు చూద్దాం. ఈ సమాచారం డైటీషియన్ నందిని అందించారు. జీర్ణక్రియ మెరుగుపడుతుంది: అరటిపండులోని పీచుపదార్థం, నల్ల మిరియాలలో ఉండే పైపెరిన్ జీర్ణ ఎంజైమ్‌లను చురుకుగా మారుస్తాయి. దీనివల్ల ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. గ్యాస్, అసిడిటీ, ఉబ్బరం లాంటి సమస్యలు తగ్గుతాయి. కలయికతో రోగనిరోధక శక్తి పెరుగుతుంది: అరటిపండులో విటమిన్ సి, నల్ల మిరియాలలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఈ రెండింటిని కలిపి తీసుకుంటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. రుతువులవల్ల వచ్చే వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. బరువు తగ్గడానికి సహాయం: అరటిపండులోని పీచుపదార్థం ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్న భావన కలిగిస్తుంది. దీనివల్ల అతిగా తినకుండా ఉంటారు. నల్ల మిరియాలు జీవక్రియను వేగవంతం చేస్తాయి. ఈ రెండూ బరువు తగ్గడానికి సహాయపడతాయి. గుండె ఆరోగ్యానికి మంచిది: అరటిపండులోని పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచుతుంది. నల్ల మిరియాలు రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. వీటిని కలిపి తినడం వల్ల గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది.

## ఇలాంటి సినిమాకా హడావిడి చేశారు



మొన్నటి దాకా ఎవరూ పట్టించుకోని సినిమా హఠాత్తుగా మైత్రి సంస్థ డిస్ట్రిబ్యూషన్ తీసుకోవడంతో కాసింత వెలుగులోకి వచ్చింది. కిష్కిందపురి ఈవెంట్ లో సాయి ధరమ్ తేజ్ దీని గురించి ప్రత్యేకంగా ప్రస్తావించడంతో మూవీ లవర్స్ ఒక లుక్ వేద్దామనుకున్నారు. అదే ఇలాంటి సినిమా మీరెప్పుడూ చూసుండరు. టైటిలే ఇంత వెరైటీగా ఉందంటే 100 నిముషాలు సింగల్ షాట్ లో ఏకధాటిగా తీసిన మూవీగా ప్రచారం జరగడంతో సినీ ప్రియులు ఆసక్తి చూపించిన మాట వాస్తవం. ఇంత హడావిడి జరిగింది కాబట్టే మార్నింగ్ షోలలో జనం కనిపించారు. సంధ్య థియేటర్ లో ఉదయం స్పెషల్ షో దాదాపు నిండిపోయింది. ఇంతా చేసిన హీరో కం దర్శకుడు సూపర్ రాజా ఆడియన్స్ సహనంతో ఫుట్ బాల్ ఆడుకున్నాడు. ఒక మధ్యతరగతి కుర్రాడు ఇండస్ట్రీకి వచ్చి నాని, రవితేజ లాగా ఏలాలనుకోవడం మంచి ఆలోచనే. కానీ క్రియేటివిటీకి కొన్ని కొలతలు ఉన్నాయి. ప్రేక్షకుల టికెట్ డబ్బులకు గౌరవం ఇవ్వాలి. అంతే కానీ నేను సింగల్ షాట్ లో తీశాను, డబ్బులన్నీ పెట్టాను అంటే సానుభూతి రాదు. ఇంతా చేసి కథలో ఏముందంటే ఇద్దరు స్నేహితులు బైక్ మీద ప్రయాణం చేస్తూ హైదరాబాద్ మొత్తం చుట్టేస్తారు. ఎందుకంటే జర్మనీ వెళ్ళబోతున్న ఒక అమ్మాయిని ఆపడానికి. కారణాలు తెలుసుకోవాలంటే థియేటర్ కు వెళ్లి తరించాల్సిందే. షో అయ్యాక జనాలు ఇస్తున్న ఫీడ్ బ్యాక్ వింటే సదరు సూపర్ రాజా మళ్ళీ ఇలాంటి సాహసం చేయకపోవచ్చనిపిస్తోంది. నేను మంచి కంటెంట్ ఇచ్చానని పదే పదే పదిసార్లు అరిచి చెప్పడం కాదు, ఒక్కసారైనా సినిమా చూసిన పబ్లిక్ అనుకోవాలి. కానీ సూపర్ రాజా ఒక్క శాతం కూడా ఆ ఛాన్స్ ఇవ్వలేదు.

## కల్కి నుంచి
## దీపికా పదుకునే ఔట్



గత ఏడాది విడుదలై రికార్డుల మోత మ్రోగించిన కల్కి 2898 ఏడి సీక్వెల్ ఎప్పటి నుంచి ప్రారంభమవుతుందనేది ఇంకా క్లారిటీ లేదు కానీ నిర్మాణ సంస్థ వైజయంతి మూవీస్ ఒక పెద్ద బాంబు పేల్చింది. కల్కి కొనసాగింపులో హీరోయిన్ దీపికా పదుకునే ఉండదని, అధికారికంగా ప్రకటిస్తున్నామని, తనతో భాగస్వామ్యం కుదకరపోవడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నామని, కమిట్ మెంట్ ఎక్కువగా కోరుకునే ఇలాంటి పాత్ర కోసం సరైన ప్రత్యామ్నయం చూస్తామని పేర్కొంది. అయితే కారణాలు పేర్కొనలేదు కానీ అంతర్గతంగా ఆమెతో ఏర్పడిన విభేదాలే ఈ కఠిన నిర్ణయానికి ఉసిగొలిపి ఉంటాయని ఫిలిం నగర్ వర్గాల కథనం. ఆ మధ్య స్పిరిట్ కోసం ముందు దీపికా పదుకునేని తీసుకున్న సందీప్ రెడ్డి వంగా తర్వాత ఆమె డిమాండ్లను భరించలేక త్రిప్తి డిమ్రిని లాక్ చేసుకోవడం నేషనల్ వైడ్ హాట్ టాపిక్ అయ్యింది. రెండు వర్గాలు దీని గురించి అధికారికంగా స్పందించకపోయినా ప్రచారమైతే జోరుగా జరిగింది. ఇప్పుడు కల్కి 2898 ఏడి నుంచి దీపికాని తప్పించడం వెనుక ఏం జరిగిందనేది ప్రస్తుతానికి సస్పెన్స్. అల్లు అర్జున్ – అట్లీ కాంబో మూవీ చేయడం వల్లే దీనికి డేట్లు కేటాయించలేనని చెప్పిందా లేక తెరవెనుక ఇంకేదైనా మతలబు ఉందా అనేది దర్శకుడు నాగ అశ్విన్ బయటికి వచ్చి చెబితే తప్ప ఈ ఇష్యూ గురించి క్లారిటీ రాదు. ఇదంతా బాగానే ఉంది కథలో కీలకమైన సుమతి పాత్ర ఇప్పుడు ఎవరికి ఇస్తారనేది అసలు చిక్కు. మృణాల్ ఠాకూర్ లాంటి వాళ్లకు ఛాన్స్ లేదు. ఎందుకంటే తను ఆల్రెడీ ఇందులోనే చిన్న క్యామియో చేసింది కాబట్టి. రష్మిక మందన్న, జాన్వీ కపూర్ లాంటి ఆప్షన్లు చూడొచ్చు.

## ఆహా... ఏమా ఆట... ఏమా పోరాటం!




భారత మహిళల క్రికెట్ జట్టు పరుగుల వరద పారిన పోరులో పోరాడి ఓడింది. ఆసీస్ తో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జరిగిన ఆఖరి వన్డేలో హర్మన్‌ప్రీత్‌కౌర్ సారథ్యంలోని భారత జట్టు 43 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. దీంతో ఆసీస్ 2–1తో సిరీస్ చేజిక్కించుకుంది. మొదట ఆస్ట్రేలియా 47.5 ఓవర్లలో 412 పరుగులకు ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' బెత్ మూనీ (75 బంతుల్లో 138బీ 23 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్ సెంచరీతో విజృంభించగా... జార్జియా వాల్ (68 బంతుల్లో 81బీ 14 ఫోర్లు), ఎలీస్ పెర్రీ (72 బంతుల్లో 68బీ 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకాలతో ఆకట్టుకున్నారు. ఛేదనలో భారత జట్టు 47 ఓవర్లలో 369 పరుగులకు ఆలౌటైంది. స్మృతి మంధాన (63 బంతుల్లో 125బీ 17 ఫోర్లు, 5 సిక్స్‌లు) సుడిగాలి సెంచరీతో ప్రత్యర్థిని వణికించగా... దీప్తి శర్మ (58 బంతుల్లో 72బీ 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (35 బంతుల్లో 52బీ 8 ఫోర్లు) హాఫ్‌సెంచరీలతో మెరిశారు. చివర్లో స్నేహ్ రాణా (35బీ 3 ఫోర్లు) పోరాడినా... టీమిండియా లక్ష్యానికి 43 పరుగుల దూరంలో నిలిచిపోయింది. మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించేకు ఈ మ్యాచ్‌లో భారత జట్టు గులాబీ రంగు జెర్సీలు ధరించి ఆడింది.

## ప్రభాస్ అభిమానుల...



**–ట్రోల్స్ దెబ్బకు క్షమాపణలు...**

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, మారుతి కాంబినేషన్‌లో రాబోతున్న లేటెస్ట్ మూవీ 'ది రాజాసాబ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ క్రింద టిజి విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో నిధి అగర్వాల్, రిద్ధి కుమార్, మాళవిక మోహనన్, సంజయ్ దత్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రం డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇక ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్స్, టీజర్, సాంగ్స్ మంచి రెస్పాన్స్ దక్కించుకున్నాయి. సినీ ప్రియులంతా ట్రైలర్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో.. టాలీవుడ్ డైరెక్టర్ కోన వెంకట్ ట్విట్టర్ ద్వారా ఓ పోస్ట్ తప్పుగా పెట్టి ట్రోల్స్‌కు గురవుతున్నాడు. అసలు అందులో ఏముందంటే.. "ఇప్పుడే ది రాజా సాబ్ టీజర్ చూశాను. నన్ను నమ్మండి.. ఈ జానర్‌లో ఇండియాలోనే అతిపెద్ద బ్లాక్ బస్టర్‌గా ఈ సినిమా నిలవబోతోంది. ఇందులో ప్రభాస్ చాలా అద్భుతంగా నటించారు. డైరెక్టర్ మారుతి మీరు చాలా అద్భుతంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. చాలా అద్భుతమైన క్షణాలను నేను ఆస్వాదించాను. అటు పీపుల్ మీడియా ఫ్యాక్టరీ మీ నిర్మాణ విలువలు అసాధారణంగా, ఊహించని విధంగా ఉన్నాయి. 2026 జనవరి 9న ఇండియన్ బాక్సాఫీసు వద్ద ఒక సునామి సృష్టించబడుతోంది.. సిద్దంకండి" అని రాసుకొచ్చాడు. దీంతో ఈ పోస్ట్ చూసిన ప్రభాస్ అభిమానులు టీజర్ కాదు అది ట్రైలర్ కావచ్చు అది కూడా గుర్తులేదా అని ట్రోల్స్ చేస్తున్నారు. దీంతో వెంటనే అప్రమత్తమైన కోనా వెంకట్ మరో ట్వీట్ చేశాడు. "దయచేయి నన్ను క్షమించండి.. టీజర్ కాదు ట్రైలర్ చూశాను" అని తప్పును సరి చేసుకున్నాడు. ప్రభాస్ అభిమానుల దాడికి భయపడిపోయిన కోన వెంకట్‌కు షాక్ తగిలినట్లు అయింది.

## యూత్ హీరో రూటేందుకు మారుస్తున్నట్టు



కిరణ్ అబ్బవరం కొత్త సినిమా కె రాంప్ కు సంబంధించి ఇప్పటిదాకా రెండు టీజర్లు వచ్చాయి. యూత్ ఫుల్ గా ఉన్నాయి. తను ఇప్పటిదాకా ట్రై చేయని కొత్త కామెడీ టింజ్ ట్రై చేసిన కిరణ్ వెరైటీ టైమింగ్ తో ఆకట్టుకునే ప్రయత్నం చేశాడు. ఒక యుట్యూబ్ రివ్యూయర్ ని ఇమిటేట్ చేయడం దగ్గరి నుంచి అమ్మాయిల మీద వేసే జోకులు దాకా రకరకాల షేడ్స్ చూపించాడు. ఇదంతా బాగానే ఉంది కానీ కావాల్సినన్ని బూతులు జొప్పించడం యువతకేమో కానీ ఫ్యామిలీ ఆడియన్స్ కి కొంచెం ఎబెట్టుగా అనిపించేలా ఉంది. బూతుని నేరుగా వాడకుండా అది ఏ బూతో స్పష్టంగా అర్థమయ్యేలా డైలాగులు రాసుకున్నారు. ఇక్కడ గమనించాల్సింది ఏంటంటే ఇలాంటి డబుల్ మీనింగ్స్ ఉంటే యూత్ ఎక్కువగా అట్రాక్ట్ అవుతారనే అంచనా ఏమైనా కిరణ్ లో ఉందేమో చూడాలి. ఒకవేళ అదే అయితే ఇది నిజం కాదని గుర్తించాలి. ఎందుకంటే ఇటీవలే విడుదలైన సెన్సేషన్ లిటిల్ హార్ట్స్ లో ఒకటి రెండు తప్ప ఎక్కడ అసభ్యత, ద్వందార్థాలు లేవు. క్లీన్ ఎంటర్ టైన్మెంట్ తో దర్శకుడు సాయి మార్తాండ్, హీరో మౌళి మెప్పించారు. కానీ కె రాంప్ దానికి పూర్తి విభిన్నంగా అనిపిస్తోంది. కథ పరంగా సింపుల్ గానే అనిపిస్తోంది. కేరళకు చదువు కోసం వెళ్లిన ఓ అల్లరి కుర్రాడు అక్కడి అమ్మాయిని ప్రేమించి ఏం చేశాడనే పాయింట్ మీద రూపొందించారు. ఫ్లాపులను పక్కనపెడితే ఎస్ఆర్ కళ్యాణ మండపం, సమ్మతమే, వినరో భాగ్యము విష్ణు కథ, క ఇలా ఒక ఫ్లోలో క్లీన్ ఎంటర్ టైన్మెంట్ తో వెళ్తున్న కిరణ్ అబ్బవరం కేవలం ట్రెండ్ ని ఫాలో అవుతూ టార్గెట్ ఆడియన్స్ కోసం రూటు.

## పాక్ పై భారత్ ఘన విజయం
## శివతాండవం చేసిన అభిషేక్ శర్మ



ఆదివారం ఆసియా కప్ సూపర్ 4 లో భాగంగా జరిగిన భారత్, పాకిస్తాన్ మ్యాచ్లో పాకిస్థాన్ ముందుగా బ్యాటింగ్ చేసింది. 171 రన్స్ చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఈ టార్గెట్ కాపాడుకోవడంలో పాకిస్తాన్ బౌలర్లు విఫలమవుతున్నారు. పిచ్ మీద ఉన్న డ్యూ ను సద్వినియోగం చేసుకోలేక తడబడ్డారు. భారత బ్యాటర్ల దూకుడు ముందు తలవంచుతున్నారు. భారత ఓపెనర్లు గిల్, అభిషేక్ శర్మ శివతాండవం చేస్తున్నారు. నవరాత్రి సంబరాలను టీమిండియా అభిమానులకు ముందే తీసుకొస్తున్నారు. టీమిండియా స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ తన జోరు కొనసాగించాడు . ప్రత్యర్థితో పనిలేకుండా చెలరేగుతున్నాడు ఎదుర్కొన్న తొలి బంతినే సిక్సర్‌గా బాదడం అలవాటు మార్చుకున్నాడు. ఫస్ట్ బ్యాటింగ్ చేసినా.. లక్ష్య ఛేదనకు దిగినా ఐ డోంట్ కేర్ అన్న రీతిలో చెలరేగుతున్నాడు. యూఏఈతో జరిగిన తొలి మ్యాచ్‌లోనూ ఫస్ట్ బాల్‌నే సిక్సర్ బాదిన అభిషేక్ శర్మ.. పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ ఎదుర్కొన్న తొలి రెండు బంతులను 4, 6 కొట్టాడు. పాకిస్థాన్ టాప్ బౌలర్ అయిన షాహీన్ షా అఫ్రిదికే చుక్కలు చూపించాడు. తాజాగా పాకిస్థాన్‌తో జరిగిన సూపర్–4 మ్యాచ్‌లోనూ షాహిన్ అఫ్రిది వేసిన తొలి ఓవర్ ఫస్ట్ బాల్‌ను అభిషేక్ సిక్సర్‌గా తరలించాడు. గిల్ తో కలిసి అభిషేక్ 100 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆసియా కప్ లో భారత్ జైత్రయాత్ర కొనసాగుతోంది. సూపర్ 4 లో తొలి మ్యాచ్ లో పాకిస్తాన్ చిత్తుగా ఓడించింది. దీంతో ఈ టోర్నమెంట్ లోనే పాకిస్తాన్ ను టీమిండియా రెండో సారి ఓడించింది. భారత ప్లేయర్లను రెచ్చగొడితే ఎలా ఉంటుందో పాక్ బౌలర్లకు మనోళ్లు చూపించారు. హార్దిక్ పాండ్యా తో కలిసి తిలక్ వర్మ 18.5 ఓవర్లలో 174/4 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.



Edited, Published & Owned by **BHUPATHI SANTHOSH.** Printed at PARAHUSHAR PRINTING PUBLICATIONS, H. NO. 1-6-27/2,SRI NAGAR COLONY, MAHABUBABAD, WARANGAL, TELANGANA-506101.Published at Jammikunta, karimnagar,Telangana-505122. EDITOR: BHUPATHI SANTHOSH. Cell: 9247819181 | **RNI No: TGTEL/25/A1882,**Email:Mana vaartha tg. Daily@gmail.com